


## నేటి నుంచి 70వ వార్షిక తిరునాళ్లు

8 లో...

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
ప్రకాశం బాపట్ల
బుధవారం 12 మార్చి 2025 పేజీలు 8

# జిల్లాలో రెండు ఆల్ట్రా మెగా సోలార్ విద్యుత్తు ప్లాంట్లు

**సూర్యప్రతినిధి, ఒంగోలు**

ప్రకాశం జిల్లాలో రెండు ఆల్ట్రా మెగా సోలార్ విద్యుత్తు ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామని విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రకటించారు. శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి గొట్టిపాటి మంగళవారం సమాధానం చెప్పారు. దీనికి సంబంధించి ఆయన సభలో మాట్లాడుతూ రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు రాయలసీమ తరువాత ప్రకాశం జిల్లా అత్యంత అనువైన ప్రాంతమని పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా దొనకొండ, చంద్రశేఖరపురం ప్రాంతాల్లో మెగా సోలార్ విద్యుత్ ప్లాంట్ల నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఒక్కో ప్లాంట్ నిర్మాణానికి సుమారు 5,500 ఎకరాల భూమి అవసరమని తెలిపారు. ప్లాంట్ల నిర్మాణానికి భూ కేటాయింపులకు సంబంధించి ఇప్పటికే ప్రకాశం జిల్లా కలెక్టర్ నుంచి నివేదిక కోరామన్నారు. కలెక్టర్ నివేదిక తరువాత సోలార్ ప్లాంట్ల నిర్మాణాన్ని చేపడుతామని మంత్రి చెప్పారు. ఒక్కో సోలార్



విద్యుత్ ప్లాంట్ ద్వారా సుమారు వెయ్యి మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని వెల్లడించారు.

### ఐసీఈ -2024 పాలసీ గేమ్ ఛేంజర్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ - 2024 (ఐసీఈ) ద్వారా పునరుత్పాదక విద్యుత్ రంగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే ప్రథమస్థానంలో నిలుస్తుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ ద్వారా 7.5 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఐసీఈ పాలసీ ద్వారా 100 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తి లక్ష్యంగా ముందుకెళ్తున్నామని మంత్రి గొట్టిపాటి సభాముఖంగా వివరించారు.

**ఒక్కొక్క సోలార్ ప్లాంట్‌తో వెయ్యి మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి**

**ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ -2024 తో 7.5 లక్షల మందికి ఉపాధి**

**100 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తి లక్ష్యం**

**అసెంబ్లీలో విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్**



# దొనకొండకు మహర్దశ

**సోలార్ పార్క్ ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తు**

**దర్శి నియోజకవర్గ అభివృద్ధికి మైలురాయి**

**యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు**

**ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కృతజ్ఞతలు**

దర్శి, మేజర్‌న్యూస్: దొనకొండలో విద్యుత్తు సోలార్ పార్కును ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం అసెంబ్లీలో ప్రకటించిన సందర్భంగా ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి సీఎం చంద్రబాబు, విద్యుత్తు మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. దర్శి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలనే తన కల నెరవేరుతున్నందుకు ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. ప్రకాశం జిల్లాలో రెండు సోలార్ విద్యుత్ పార్కులను ఏర్పాటు చేసేందుకు కసరత్తు జరుగుతున్నట్లు మంత్రి ప్రకటించడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా వెనుకబడిన దొనకొండలోని రుద్రసముద్రం సమీప గ్రామాలలో 5500 ఎకరాలలో ఈ సోలార్ ఎనర్జీ పార్కును ఏర్పాటు చేసేందుకు కృషి జరుగుతుందని ప్రకటించడం దర్శి అభివృద్ధిలో ఒక మైలురాయిగా అభిప్రాయపడ్డారు. ఇలాంటి ప్రాజెక్టుల ద్వారా విద్యుత్తు ఉత్పత్తి తో పాటు 10 లక్షల కోట్ల పెట్టుబడులు వేలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని మంత్రి ప్రకటించారన్నారు. అందులో దొనకొండ ప్రాంతంలోని వందలాది మంది నిరుద్యోగులకు ఇది ఎంతో మేలు చేస్తుందన్నారు. దర్శి అభివృద్ధికి సోలార్ పార్కు ఒక ముందడుగుగా చెప్పారు. కూటమి ప్రభుత్వ ఎనిమిది నెలల పాలనలో ఎన్నికల్లో ముఖ్యమంత్రి వెనుకబడిన దర్శి ప్రాంతాన్ని అభివృద్ధి ప్రాంతంగా మారుస్తానని ఇచ్చిన హామీలో భాగంగానే సోలార్ విద్యుత్తు పార్కు కార్యరూపం దాల్చుతున్నట్టు వివరించారు. దర్శి ప్రాంతాన్ని అభివృద్ధి ప్రాంతంగా మార్చాలన్న గొట్టిపాటి కుటుంబం చిత్తశుద్ధికి ఇది ఒక నిదర్శనమన్నారు. దర్శి అభివృద్ధికి జరుగుతున్న కృషికి ప్రతి ఒక్కరూ సహకరించాలని డాక్టర్ లక్ష్మి కోరారు.

# నీటి ఎద్దడి నివారణకు ఇచ్చిన హామీని అమలు చేయాలి

**అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ**

బాపట్ల, మేజర్‌న్యూస్: వేసవికాలం నీటి ఎద్దడి నివారణ చర్యల్లో భాగంగా బాపట్ల నియోజకవర్గంలో రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు అనుమతులు మంజూరుకు శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ రాజు స్పీకర్ అయ్యన్న పాత్రుడు ద్వారా ప్రభుత్వానికి విన్నవించారు. బడ్జెట్ సమావేశాల్లో నరేంద్ర వర్మ మాట్లాడుతూ పూర్వపు ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం1988లో బాపట్ల నియోజకవర్గ ప్రజలకు తాగునీటి అవసరాల రీత్యా నిర్మించిన మంచినీటి చెరువును ఇప్పటివరకు ఉపయోగిస్తున్నామని 25 వేల మంది జనాభాకు ఆ ఒక్క చెరువు నీటి అవసరాలను తీర్చిందని ఇప్పుడు 1,20,000 జనాభా కలిగిన బాపట్ల నియోజకవర్గం కు రెండో సమ్మర్



స్టోరేజ్ ట్యాంక్ అవసరం ఉందని విన్నవించారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక్క మనిషికి 120 లీటర్లు సరఫరా చేయాలన్నారు నీటి ఎద్దడి కారణంగా 60 లీటర్ల వరకే సరఫరా చేస్తున్నామన్నారు. వేసవిలో రోజు మార్చి రోజు నీటి సరఫరా చేసిన పరిస్థితులను వివరించారు. మరొక సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను 100 ఎకరాలలో నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. 2014- 19 కాలంలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చి ఉన్నారని సార్వత్రిక ఎన్నికల ముందు ప్రచారంలో కూడా ప్రస్తుత ముఖ్యమంత్రి నియోజకవర్గ పర్యటనలో అదే అంశంపై హామీ ఇచ్చి ఉన్నారని, మున్సిపల్ శాఖ అధికారులకు సభా ముఖంగా రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ కొరకు విజ్ఞప్తి చేస్తున్నానని తెలియజేశారు.





# ఏసిబి వలలో బాపట్ల జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక అధికారి

**రాయితీ రుణాల దరఖాస్తుల ప్రొసీడింగ్స్ కోసం లంచం**

**రెండు దరఖాస్తులకు రూ. 40 వేలు డిమాండ్ చేసిన వైనం**

**గుంటూరు అవినీతి నిరోధకశాఖ అదనపు ఎస్పీ మహేంద్రమత్**

అద్దంకి, మేజర్‌న్యూస్: ప్రభుత్వ రాయితీ పొందేందుకు దరఖాస్తుదారుల నుంచి బాపట్ల జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక అధికారి టి.ఉమాశంకర్ లంచం తీసుకంటూ గుంటూరు అవినీతి నిరోధకశాఖ అధికారులకు పట్టుబడ్డాడు. ఈ సంఘటన మంగళవారం సాయంత్రం అద్దంకి పట్టణంలోని కెఅండ్‌కె కన్సల్టెన్సీ వద్ద చోటుచేసుకుంది. ఆశాఖ అదనపు ఎస్పీ మహేంద్ర మత్ అందించిన సమాచారం మేరకు సంతమాగులూరు గ్రామానికి చెందిన వీర్ల రమేష్‌బాబు, మరొకరు

మిగతా 3లో



ఢిల్లీలోని పార్లమెంట్ భవనంలో కమిటీ హాలులో గృహ, పట్టణ వ్యవహారాల కమిటీ సమావేశంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న కమిటీ చైర్మన్, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, కమిటీ సభ్యులు

## డిఎస్పీ శ్రీనివాసరావును కలసిన జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకులు



నిజాంపట్నం, మేజర్ న్యూస్: గత వైసిపి పాలనలో బీసీలకు అన్ని రంగాలలో అన్యాయం జరిగిందని బాపట్ల జిల్లా బీసీ సంక్షేమ యువజన సంఘ జిల్లా అధ్యక్షులు పచ్చకట్ల గంగరాజు అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ స్థాపించిన దగ్గర నుండి బీసీలు ఐక్యతగా ఉండి టిడిపి పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని అది జీర్ణించుకోలేక వైసీపీ పాలనలో బీసీలు టిడిపికి ఓటు బ్యాంక్ గా బీసీలు ఉన్నారని గత వైసిపి ప్రభుత్వం వారిని అణిచివేయాలని దుర్మార్గపు ఆలోచనతో బీసీలపై క్రమంగా కేసులు బనాయించి వారిని బెదిరింపులకు పాల్పడి ఎన్నో ఇబ్బందులకు గురి చేసిన అన్నారు. ఈ సందర్భంగా సోమవారం రేపల్లె డిఎస్పి కార్యాలయంలో డి.ఎస్.పి ఆవుల శ్రీనివాసరావుని మర్యాదపూర్వకంగా కలిసి ఆయన సత్కరించి శుభాకాంక్షలు తెలిపి బీసీలపై పెట్టిన అక్ర కేసులు వెత్తి వెయ్యాలని కోరారు. ఆయన వెంట బీసీ యువజన జాయింట్ సెక్రెటరీ బడుగు రాకేష్, మరియు దామర్ల ఫణి ఉన్నారు.

## జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయాలి: దూళ్ళ సురేష్



చెరుకుపల్లి, మేజర్‌న్యూస్: ఈ నెల 14వ తారీఖున పిఠాపురంలో జరిగే జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ సభను విజయవంతం చేయాలని మండలం జనసేన పార్టీ అధ్యక్షులు దూళ్ళ సురేష్ అన్నారు. జిల్లా కార్యదర్శి, రేపల్లె నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త మత్తి భాస్కర్ రావు ఆదేశాల మేరకు అధ్యక్షులు దూళ్ళ సురేష్ మంగళవారం చెరుకుపల్లిలో అయన విలేకరులతో మాట్లాడటం జరిగింది. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ అధ్యక్షతన భారీగా ఆవిర్భావ సభను జరుపుటకు జనసేన పార్టీ నిర్ణయించింది అని ఆయన అన్నారు. కావున మండలంలోని జనసేన పార్టీ నాయకులు, జన సైనికులు, వీర మహిళలు, కూటమి నాయకులు అందరూ పాల్గొని సభను విజయవంతం చేయవలసిందిగా ఆయన కోరారు.

## పి4 సర్వేకు ప్రజలు సహకరించండి

### - ఆర్డీవో గ్లోరియా



బాపట్ల, మేజర్‌న్యూస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న పి 4 సర్వేను మంగళవారం పురపాలక సంఘం పరిధిలోని 10వ వార్డులో బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారిణి పి.గ్లోరియా, కమిషనర్ జి.రఘునాథరెడ్డి తో కలిసి పరిశీలించారు. ప్రజలు సిబ్బంది అడిగే సమాచారాన్ని తెలియజేసి సర్వేకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సర్వేను త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

## పన్నుల వసూళ్లు వేగవంతం చేయండి



బాపట్ల, మేజర్‌న్యూస్: బాపట్ల పురపాలక సంఘం పరిధిలో ఆస్తి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు, నీటి కుళాయి చార్జీల వసూళ్ల పురోగతిపై 10 వ సచివాలయం 23 వ వార్డు నందు మునిసిపల్ కమీషనర్ జి.రఘునాథ రెడ్డి, రెవెన్యూ అధికారి అబ్దుల్ జబ్బార్ తో కలిసి పురపాలక సంఘ సిబ్బంది, సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. పన్నుల వసూళ్ల విషయంలో అలసత్వం వద్దని అన్నారు.పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని ఆదేశించారు.మొండి బకాయిలను గుర్తించి వాటి వసూళ్ల విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ సమీక్షలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ శివరామకృష్ణ ఉన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే ఆనందబాబు



అమృతలూరు(భట్టిప్రోలు)మేజర్ న్యూస్:ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి అమృతలూరు మండలం అమృతలూరు గ్రామానికి చెందిన క్రొత్తపల్లి కమల,అఖిల, సౌజన్య,బాబు రావులు,కూచిపూడి గ్రామానికి చెందిన వేంకటేశ్వర రావు,నాంచారమ్మ, వెంకటేశ్వరమ్మలు, కొడితాడిపర్రు గ్రామానికి చెందిన తిరుపతిరావు అనారోగ్యంతో ప్రైవేట్ వైద్యశాలల్లో చికిత్సలు చేఇంచు కున్నారు.చికిత్స కోసం అయిన బిల్లులను వేమూరు నియోజక వర్గ శాసనసభ్యులు నక్కా ఆనంద బాబు వారి రిఫరెన్స్ లెటర్ ద్వారా సి యం ఆర్ యఫ్ కార్యాల యానికి పంపించారు. తదుపరి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చెక్కుల రూపంలో క్రొత్తపల్లి కమల కు రూ 1,21,329 లు జాస్తి అఖిలకు రూ 31,278 లు,సుంకర సౌజన్య కు రూ 30,000 లు,మల్లెల బాబురావు కు రూ 27,583 లు,బెల్లం వేంకటేశ్వరరావు కు రూ 88,454 లు,జంపని నాంచారమ్మ కు రూ 39,500 లు,గొళ్ళ వెంకటేశ్వరమ్మ కు రూ 30,028 లు,జుటూరి తిరుపతిరావు కు రూ 25,000/-మొత్తం రూ 3,93,172 లను మంజూరు చేసి ఉన్నారు.మంజూరు అయిన మొత్తాన్ని వారికి,వారి కుటుంబ సభ్యులకు చెక్కుల రూపంలో మాజీ మంత్రి,వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనందబాబు మంగళవారం అందించారు.

## ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ



బాపట్ల, మేజర్‌న్యూస్: బాపట్ల వ్యవసాయ కళాశాలలో మార్చి 11న మంగళవారం వ్యవసాయ విస్తరణ విభాగం ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాస కార్యక్రమం కళాశాల ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కొరకు నిర్వహించబడిన కార్యక్రమం లోబా పట్ల ఫోరం ఫర్ బెటర్ కార్యదర్శి డాక్టర్ పిసి సాయిబాబు, ఐఐటి ఖరగ్పూర్ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ విజయ్ కుమార్, ఫోరం ఫర్ బెటర్ సభ్యులు కే రవిబాబు, జి వెంకటేశ్వర్లు, భారతీయ హేతువాద సంఘ కార్యదర్శి మేడూరి సత్యనా రాయణ వ్యక్తిత్వ వికాస నిపుణులుగా హాజరై విజయవం తంగా నిర్వహించారు.నిపుణులు వ్యక్తిత్వ వికాసం, కమ్యూ నికేషన్స్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు, సమయ నియం త్రణ, ప్రొఫెషనల్ ఎథిక్స్ వంటి అంశాలపై విద్యార్థులకు కీలక సూచనలు, సలహాలు అందించారు. వారు విద్యార్థు ల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడం, మెరుగైన ప్రజెంటేషన్ స్కిల్స్ అభివృద్ధి చేసుకోవడం, కెరీర్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం వంటి అంశాలపై దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని ఉదాహరణలతో వివరించారు. ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం వలన భవిష్యత్తులో విద్యార్థులకు అనుకూలమైన మార్గదర్శకం చేకూరుతుందని వ్యవసాయ విస్తరణ విభాగం ప్రొఫెసర్, హెడ్ డా. సురేష్ కుమార్ తెలియజేశారు. ఎస్సీ- ఎస్టీ నిధుల వినియోగ సమన్వయకర్త డాక్టర్ కె. సుశీల, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంగన్వాడీల న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలి



భట్టిప్రోలు,మేజర్ న్యూస్:అధికారంలోనికి వచ్చిన వెంటనే అంగన్వాడీలకు న్యాయం చేస్తామని హామీలు ఇచ్చి ఇప్పుడు వారికి తీరని అన్యాయం చేయటం సారికాదని వేమూరు నియోజకవర్గ అంగన్ వాడి విభాగం అధ్యక్షురాలు, భట్టిప్రోలు మండల పరిషత్ అధ్యక్షురాలు దావూరి వెంకట లలిత మల్లేశ్వరరావు అన్నారు.ఈ మేరకు ఆమె భట్టిప్రోలు లో విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మాట తప్పి మోసం చేయడం అంటే ఇదే నన్నారు. తమ గోడు వినిపించాలనుకున్న అంగన్వాడీలను ఎక్కడికక్కడ నిర్బంధించడం నిరంకుశత్వానికి నిదర్శనం.వారి గొంతు నొక్కి,ఆందోళలను అణిచివేయడం కూటమి ప్రభుత్వ నియంత చేష్టలకు పరాకాష్టఅన్నారు.అంగన్వాడీల డిమాండ్లు పూర్తిగా న్యాయబద్ధమైనవని, వెంటనే వారిని పిలిచి ప్రభుత్వం చర్చించాలన్నారు. అంగన్వాడీలకు నెలకు గౌరవ వేతనం రూ.26 వేలు ఇవ్వాలని,తక్షణం గ్రాట్యూటి చెల్లింపు హామీని అమలు చేయాలని,మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా పరిగణించాలని ఆమె పేర్కొన్నారు.హెల్పర్ల పదోన్నతిపై నిర్దిష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని,పెండింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని,విధి నిర్వహణలో అంగన్వాడీలు మరణిస్తే,వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగంతో పాటు మట్టి ఖర్చుల కింద రూ.20వేలు ఇవ్వాలని డిమాండ్ చేసారు.వీటితో పాటు ఇతర 12 డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని లలితకుమారి పేర్కొన్నారు.

## యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: ఆంధ్రప్రదేశ్ యానాదుల (గిరిజన) ( సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో యానాదుల అవగాహన సదస్సు, నూతన కార్యవర్గ సమావేశం టౌన్ హాల్ కోన ప్రభాకర్ రావు కళా క్షేత్రంలో నిర్వహించారు. సభా ధ్యక్షులు కుడమల రామచంద్రయ్య మాట్లాడుతూ యానా దులు రాష్ట్రంలో సుమారు 12 లక్షల పైచిలుకు ఉన్నారని, రెక్క ఆడితే కానీ డొక్కాడని కడు భయంకరమైన బీదస్థితిలో జీవనం సాగిస్తున్నారని, రాష్ట్ర కేంద్రం ప్రభుత్వాలు యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి జీవన విధానాన్ని అభివృద్ధి చేయవలసిన అవసరం ఉందని, అదేవిధంగా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యు లను చేయాలని కోరారు. ముఖ్యఅతిథిగా పట్టణ సీఐ రాంబాబు పాల్గొని మాట్లాడుతూ యానాదులు, ఎస్సీ ఎస్టీ స్థితిని బట్టి పిటిషన్లు వస్తే మీకు కౌన్సిలింగ్ ఇచ్చి ఎఫ్ఐఆర్ దాకా పోకుండా పరిస్థితులు ఉన్నాయి. బాపట్ల జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులు బాపట్ల శివ కృష్ణ, ప్రధాన కార్యదర్శి జంపని అనిల్ కుమార్, సభ్యులు: పొట్లూరు సాయి, కొమరగిరి సంగీతరావు, రాజగిరి శ్రీనివాస్, నాగేంద్రమ్మ, రావూరి పద్మ (వేమురు ) పొట్లూరు గురవ య్య, బాపట్ల కోటయ్య, కొమరగిరి వంశీ, చందు ఏకగ్రీ వంగా ఎన్నికైనారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి బొజ్జ రాకేష్ బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చేవూరి తులసీరామ్, రమేష్, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

## 'పది' పరీక్షలకు ఏర్పాట్లు సిద్ధం: ఎంఈవోలు






భట్టిప్రోలు,మేజర్‌న్యూస్: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 17 వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలకు సంబందించి మండలం లోని ఐదు పరీక్షా కేంద్రాలలో ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు మండల విద్యాధికారులు పులి లాజర్,ఎన్ దేవరాజ్ లు మంగళవారం తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరం గాను ఈ నెల 17 నుండి 31 వరకు జరగబోయే పరీక్షలకు భట్టిప్రోలు మండలం నుండి 753 మంది విద్యార్థులు హాజరు కాబోతున్నారన్నారు. ఈ పరీక్షలకు సంబంధించిన ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.తమ్మన మల్లిఖార్జనరావు ఉన్నత పాఠశాల నందు 224 మంది విద్యార్థులు,వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 109 మంది,పెదపులివర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 140 మంది,ఐలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 90మంది,కారుమూరు-పల్లికోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నందు 190 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయ నున్నారని వారు తెలిపారు. ప్రశ్నపత్రాలను స్థానిక పోలీస్ స్టేషన్ నందు పరీక్ష కేంద్రం సంబంధించిన చీఫ్ సూపర్డెంట్లు, డిపార్ట్మెంట్ ఆఫీసర్లు భద్రపరచడం జరిగినదన్నారు.

## కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు




బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్ : ఆహార పదార్థాలలో కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఫుడ్ సేఫ్టీ ట్రెయినర్ కలకండ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఫుడ్ సేఫ్టీ పై మంగళవారం స్థానిక ఆహార భద్రత శిక్షణా కార్యాలయము నందు హోటల్ వ్యాపారులకు ఆహార భద్రత పై శిక్షణా కార్యక్రమం జరిగింది. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన ఆహారాన్ని అందిం చాలన్నారు. లేనిపక్షంలో అపరాధ రుసుము విధించటం జరుగుతుం దన్నారు. జిల్లా గెజిటెడ్ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ దేవ రాజు మాట్లాడుతూ కల్తీ ఆహారం ద్వారా ఏ వ్యక్తికైనా ప్రాణహానీ జరిగితే రూ.10 లక్షల జరిమానా విధిం చటం జరుగుతుందని చెప్పారు. జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ప్రణీత్ మాట్లాడుతూ ఆహార పదార్థాల అమ్మకాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా ఫోస్టాక్ మేనేజర్ నవీన్, ఫోస్టాక్ ఫీల్డ్ ఎక్సిక్యూటివ్ ఆఫీసర్స్ గోపి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రోన్‌ల ద్వారా పేకాట శిబిరంపై దాడి - పది మంది అరెస్ట్



చుండూరు(భట్టిప్రోలు)మేజర్‌న్యూస్: బాపట్ల జిల్లా చుండూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని యడ్లపల్లి గ్రామంలోని మారుమూల ప్రదేశంలో మంగళవారం పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో చుండూరు ఎస్సై రహిమాన్ వారి సిబ్బంది ఆప్రదేశానికి చేరుకున్నారు. మారుమూల ప్రాంతం అవడంతో పేకాట ఆడుతున్న ప్రదేశాన్ని గుర్తించడం కష్టతరంగా మారడంతో ఆ ప్రాంతంలో డ్రోన్‌ను ఎగురవేసి దట్టమైన చెట్ల మధ్య పేకాట ఆడుతున్న వారిని గుర్తించి 10 మందిని అదుపులోకి తీసుకోవడం జరిగిందని యస్ ఐ తెలిపారు.

## టిడ్కో ఇళ్లను తక్షణమే పూర్తి చేయాలి: సిపిఎం



గిద్దలూరు, మేజర్‌న్యూస్: సిపిఎం పార్టీ ప్రజా అధ్యయన యాత్రలో భాగంగా గిద్దలూరు నగర పంచాయతీ పరిధిలోని మోడం పల్లె ఫారం దగ్గర ఏడేళ్ల క్రితం నిర్మించిన టిడ్కో ఇండ్లను సిపిఎం బృందం ఈరోజు సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం నాయ కులు టి.ఆవులయ్య మాట్లాడుతూ 2018 తెలుగుదేశ ప్రభుత్వం హయాంలో ఏడేళ్ల క్రితం ప్రారంభించిన టిడ్కో ఇళ్లను నిర్మాణం తక్షణమే పూర్తి చేయా లని పేదల సొంతింటి కలను నెరవే ర్చా లని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.నర్సింలు, డి.శ్రీనివాసులు, డివిఎ న్ మూర్తి, శేషగిరి పాల్గొన్నారు.

## చీటింగ్ కేసు నమోదు

ముండ్లమూరు, మేజర్‌న్యూస్: మండలంలోని పసుపుగల్లు గ్రామానికి చెందిన బిజ్జం సుబ్బారెడ్డి తనకు తాళ్లూరు మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన మాజీ ఐటిసి ఉద్యోగి దారం నాగార్జున్ రెడ్డి 2023 సంవత్సరంలో బిజ్జం సుబ్బారెడ్డికి వ్యవసాయ పనిముట్లు ట్రాక్టర్, ట్రక్కులు, రోటవేటర్స్ మొదలగునవి సబ్సిడీ ద్వారా ఇప్పిస్తానని చెప్పి నమ్మించి, అతని వద్ద సుమారు 8 లక్షల రూపాయలు డబ్బులు తీసుకుని, ఫిర్యాదికి వ్యవసాయ పనిముట్లు అయినా ట్రాక్టర్స్, ట్రక్కు,రోటవేటర్ మొదలైన వస్తువులు ఇవ్వకుండా, అతని డబ్బులు అతనికి ఇవ్వకుండా మోసం చేసినట్లు అదే విధంగా చుట్టుపక్కల మండలాల్లో ఉన్న వ్యవసాయదారులను ఇదేవిధంగా నమ్మించి చేసి, వారి వద్ద డబ్బులు తీసుకున్నట్లు ఫిర్యాదు చేశాడు. సుబ్బారెడ్డి ఫిర్యాదుపై ఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేశారు.

## రైతు సేవా కేంద్రంలో ఈ-పంట నమోదు రైతుల జాబితా



టంగుటూరు మేజర్‌న్యూస్: రైతు సేవా కేంద్రాలలో ఈ పంట నమోదు రైతుల జాబితా ప్రదర్శించబడుతుందని జిల్లా వ్యవసాయాధికారి ఎస్, శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని కాకు టూరి వారి పాలెం గ్రామంలో జరుగుతున్న పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ 2024-25 సీజన్కు ఈ పంట సామాజిక తనిఖీ గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూరబీ సీజన్ లో ఈ పంట నమోదు చేసిన రైతులు జాబితాను ప్రతి రైతు సేవా కేంద్రాల్లో సామాజిక తనిఖీ కొరకు ప్రదర్శించి గ్రామసభ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జాబితాలో తప్పులు నమోదయి ఉంటే గ్రీవెన్స్ రూపంలో గ్రామంలోని ఉన్న వ్యవసాయ సహాయకులకు తెలియజేస్తే సరి చేస్తారని తెలిపారు. త్వరలో రైతులకు యంత్ర పరికరాలు అందజేస్తామని తెలిపారు. వచ్చే ఖరీఫ్ సీజన్ కి నువ్వు విత్తనాలు, సూక్ష్మ పోషకులు ఎరువులు అయినా జింకు జిప్సం బోరాన్ ఎరువులను రాయితీ మీద రైతులకు అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సాంకేతిక వ్యవసాయ అధికారి శ్రీనివాస్ నాయక్, జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ అధికారి శైలజ, మండల వ్యవసాయ అధికారి స్వర్ణలత, విస్తరణ అధికారులు ఎన్.వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, గ్రామ వ్యవసాయ అధికారులు రైతులు పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో బాపట్ల జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక అధికారి

**మొదటి పేజీ తరువాయి** పీఎంఈజీపీ పథకం కింద రాయితీ రుణం పొందేందుకు అంతర్జాలంలో దరఖాస్తు చేశారు. సదరు రెండు దరఖాస్తులను ప్రాసెస్ చేసేందుకు గాను బాపట్ల జిల్లా పరిశ్రమల కేంద్రంలో పరిశ్రమల ప్రోత్సాహక అధికారి టి.ఉమాశంకర్ ఒక్కో దరఖాస్తుకు రూ. 20 వేల చొప్పున రూ. 40 వేలు డిమాండ్ చేశాడు. లంచం ఇవ్వడం ఇష్టం లేని దరఖాస్తు దారులు గుంటూరు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన అధికారులు మంగళవారం సాయంత్రం అద్దంకి పట్టణంలోని కెఅండ్‌కె కన్సల్టెంట్ వద్ద పిర్యాదుదారుల నుంచి మధ్యవర్తి అయిన కన్సల్టెంట్ అకౌంటెంట్ కిషోర్‌బాబు ద్వారా ఉమాశంకర్‌కు నగదు చేరే సమయంలో ఏసీబీ అధికారులు నేరుగా పట్టుకున్నారు. ఇద్దరు నిందితులను విజయవాడ ఏసీబీ ప్రత్యేక న్యాయ స్థానంలో హాజరు పురచనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు లంచం డబ్బుల కోసం ఎవరైనా వేధించినట్లయితే సంబంధిత జిల్లా అధికారులకు లేదా ఏసీబీ టోల్ నెం.1064 నంబరుకు, లేదా మొబైల్ నంబరు 9440440057 నంబరుకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అదనపు ఎస్పీ వెంట ఇన్స్పెక్టర్లు సురేష్‌బాబు, సుబ్బారావు ఉన్నారు.

## పరిపాలన అధికారిగా మురళి నియామకం



ముండ్లమూరు, మేజర్‌న్యూస్: స్థానిక ఎంపీడీవో కార్యాలయం లో ఇన్చార్జి పరిపాలనాధికారిగా యం. మురళిని నియమించినట్లు ఎంపీడీవో ఆర్.జనార్ధన్ తెలియజేశారు. ప్రస్తుతం ఎక్కడ పరిపాలనాధికారిగా పనిచేస్తున్న బి.కల్పన అనారోగ్యం కారణంగా ఈనెల 31వ తేదీ వరకు మెడికల్ పెట్టారు. సీనియర్ సహాయకులుగా పనిచేస్తున్న యం.మురళిని ఇంచార్జ్ పరిపాలన అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని ఎంపీడీవో తెలిపారు.



## నిరుద్యోగ యువతకు రూ.3వేలు భృతి చెల్లించాలి

### మాజీ ఎంపీపీ గాయం బలరాం రెడ్డి

హనుమంతునిపాడు, మేజర్‌న్యూస్: మండలంలోని వైయస్సార్ విగ్రహం వద్ద కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు మేనిపెస్టోలో చెప్పిన విధంగా విద్యార్థులకు పీజు రీయింబర్స్మెంట్, వసతి దీవెన, విద్యాదీవెన కింద ఇవ్వాల్సిన బకాయిలు, నిరుద్యోగ యువతకు రూ.3వేలు భృతి చెల్లించాలని, కొత్త మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ప్రయత్నాలు ఉపసంహరించుకోవాలని నిరసన గళం తెలుపడానికి, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైయస్ఆర్ సీపీ కనిగిరి నియోజక వర్గ ఇన్చార్జి దద్దాల నారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన నిలుస్తూ ప్రభుత్వం సర్కార్ పై నిరసన గళం తెలుపడానికి ఈ నెల 12 వ తేదీన తలపెట్టిన "యువత పోరు" అనే కార్యక్రమం ఈ నెల 12 తేదీన ఒంగోలులో విద్యార్థులు, తల్లిదండ్రులు, నిరుద్యోగులతో కలిసి ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కి వినతి పత్రం సమర్పించనున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు యక్కంటి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ యూత్ భవనం కృష్ణారెడ్డి, పంచాయతీరాజ్ వింగ్ మధుసూదన్ రెడ్డి. ఎస్సీ సెల్ గురుప్రసాద్. నియోజకవర్గం బూత్ కమిటీ వింగ్ కస్తాల బాలాజీ, ఎంపిటిసిలు నారాయణస్వామి, రాజు, సర్పంచ్‌లు రాజారావు, కలుకూరి చిన్న, కొటికల లింగేశ్వరావు, నాయకులు వెంకటరెడ్డి, మూరక వెంకటరెడ్డి, వెంకటకాశయ్య, మౌలాలి, ఎలిక తిరుపతయ్య, శ్రీను, బలసాని యహొషువ, వెలుగొండయ్య, సుందర్, బంకా నరసింహం, శ్రీను, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యువత పోరుబాట పోస్టర్ ఆవిష్కరణ

కొత్తపట్నం, మేజర్‌న్యూస్: యువత పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైసీపీ అధ్యక్షులు మండల పరిషత్ అధ్యక్షులు లంకపోతు అంజిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక కె.పి రెస్టారెంట్ నందు పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా నిరసన కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ అంజిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల పక్షాన అండగా వై ఎస్ఆర్సిపి ఉందని నేటికీ విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు నిధులు విడుదల చేయాలని కోరుతూ 12వ తేదీ ఒంగోలు కలెక్టర్ ఆఫీస్ వద్ద జరిగే నిరసన కార్యక్రమానికి ఎస్ఆర్సిపి మండల నాయకులు,కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. గ్రామాలలో వైఎస్ ఆర్ సి పి కార్యకర్తలపై అనేక విధాలుగా కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని వాటన్నిటిని పోరాటం ద్వారా తిప్పి కొట్టాలని కార్యకర్తలకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో, సర్పంచులు విశ్వనాథపల్లి ఆనంద్, కోటిరెడ్డి ,ముసలారెడ్డి, ఎంపీటీసీ కోటేశ్వరరావు, రాజగోపాల్ రెడ్డి, మండల నాయకులు రమాదేవి, రవి, బ్రహ్మయ్య, బ్రహ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## హనుమంతరావు కుటుంబాన్ని పరామర్శించిన డాక్టర్ సాగర్



ముండ్లమూరు, మేజర్ న్యూస్: మండలంలోని నూజెళ్లపల్లి గ్రామంలో టిడిపి నాయకుడు కిలారి హనుమంతరావు అనారోగ్యం రీత్యా మరణించగా విషయం తెలుసుకున్న టిడిపి యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ పరామర్శించారు. మృతుడు కిలారి హనుమంతరావు పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో ముండ్లమూరు మండల టిడిపి అధ్యక్షులు కూరపాటి శ్రీను, క్లస్టర్ల ఇంచార్జ్‌లు సుంకర రాఘవరెడ్డి, శేషగిరిరావు, మండల మాజీ జడ్పీటిసి నాగరాజు, టిడిపి సీనియర్ నాయకులు మట్ట సుబ్బారెడ్డి, నీటి సంఘం అధ్యక్షులు ఉన్నం పరిపూర్ణ, చాగంటి రాంబాబు, శంకరాపురం సర్పంచ్ కూరపాటి నారాయణస్వామి, నందగోపాలు నూజిల్లపల్లి గ్రామంలోని టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నిఘా నీడలో గ్రామాలు



ముండ్లమూరు, మేజర్‌న్యూస్: మండలంలోని గ్రామాలలో సిసి కెమెరాలను ఎస్ఐ వై.నాగరాజు ఏర్పాటు చేయించారు. గ్రామాలలో దాతలు సహకారంతో సిసి కెమెరాలను ఏర్పాటు చేసి నట్లు ఎస్ఐ తెలిపారు. అద్దంకి, దర్శి రోడ్డులలో ప్రధాన కూడలిలో గ్రామాలలో ఎంట్రన్స్‌లో, గ్రామాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. కెమెరాలు ఏర్పాటు వలన ప్రతి ఒక్కరి కదలిక గమనించ వచ్చునని, కొంత మేర నేరాలు తగ్గుతాయని ఎస్ఐ నాగరాజు అభిప్రాయపడ్డారు.

## అన్నీ రైళ్లకు చీరాలకు స్టాపింగ్ సౌకర్యం కల్పించాలి




చీరాల, మేజర్‌న్యూస్: పట్టణంలో అన్ని రకాల రైళ్లు ఆగేలా కృషి చెయ్యాలని జనసేన ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి గూడూరు శివరామ ప్రసాద్, టీడీపి సీనియర్ నాయకులు గుమ్మడి ఏసు రత్నంలు అన్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ మెంబర్‌గా పఠాన్ రాజేష్ ఎంపికైన సందర్భంగా చీరాల ఎంజీసీ మార్కెట్ ఆఫీసులో చీరాల కూటమి నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ బాపట్ల జిల్లాకే తలమానికంగా ఉన్న చీరాల పట్టణం అన్నీ విధాలుగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. వస్త్ర వ్యాపారంలో చిన బొంబాయిగా, జీడిపప్పు ఎగుమతుల్లో చీరాల నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు నిత్యం వ్యాపారులు ప్రయాణం చేస్తుంటారని ఇక్కడ అన్ని రకాల రైళ్లుకు స్టాపింగ్ లేకపోవడంతో వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డేటా నాగేశ్వరరావు, ఉసురుపాటి సురేష్, ఎంఆర్ఎఫ్ రమేష్, తవనం చంద్రశేఖర్, గూడూరి శివరాంప్రసాద్, ఎమ్‌జీసీ మార్కెట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థికి అభినందనలు



చీరాల, మేజర్‌న్యూస్: చీరాల అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బాపట్ల జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో అన్నీ కళాశాలల విద్యార్థినులకు వివిధ విభాగాలలో పోటీలు నిర్వహించారు. అందులో భాగంగా స్థానిక వి.ఆర్.యస్., వై.ఆర్.యన్ కళాశాలలో డిగ్రీ బి.కాం. కంప్యూటర్స్ విభాగం నందు మొదటి సంవత్సరం చదువుచున్నటువంటి షేక్ రుక్సానా పెయింటింగ్ పోటీలో ప్రథమ బహుమతిని సాదించింది. ఈ బహుమతిని రాష్ట్ర రెవిన్యూ శాఖా మంత్రి అనగాని సత్య ప్రసాద్ చేతుల మీదుగా అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మంగళవారం వి.ఆర్.ఎస్., వై.ఆర్.ఎన్ విద్యా సంస్థల అకడమిక్ డైరక్టర్, ప్రిన్సిపాల్ డా.పి.రవి కుమార్, జనరల్ మేనేజర్ పి.దానయ్య, ప్రిన్సిపాల్ డా.పి.సత్యనారాయణలు ఆధ్వర్యంలో విద్యార్థికి అభినందన సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యలమంచిలి గ్రూప్ ఆప్ ఇండస్ట్రీస్ అధినేత యలమంచిలి రామకృష్ణ అభిష్టానుసారం కళాశాలలోని వనరులను వినియోగించుకోవడం ద్వారా ప్రతీ విద్యార్థి తమ లోని నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రయంలో క్షళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్నారిని ఆశీర్వదించిన డాక్టర్ సాగర్



దర్శి, మేజర్‌న్యూస్: మండలంలోని పోతవరం గ్రామంలో టిడిపి నాయకులు యెనుముల వెంకట్రావు, అంజలి కుమార్తె అభినవ్య ఓణీల బహుకరణ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. ఆయనతో పాటు మాజీ శాసనసభ్యులు నారపు శెట్టి పాపారావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పోతవరం గ్రామంలోని సీనియర్ టిడిపి నాయకులు, మండలంలోని వివిధ హొదాల్లో ఉన్న టిడిపి నాయకులు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## వైద్యశాల అభివృద్ధికి సహకరించండి



చీరాల, మేజర్‌న్యూస్: నియోజకవర్గంలో ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ అభివృద్ధికి సహకరించాలని వైద్యాశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌ని చీరాల కూటమి నాయకులు కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలో బడ్జెట్ నుండి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ సజ్జ హేమలత, కౌన్సిలర్ మించాల సాంబశివరావు, అక్కయ్య పాలెం మాజీ సర్పంచ్ జంగిలి రాముడు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీమల్లేశ్వరస్వామి వారి ఉత్సవం



భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: మండల కేంద్రం భట్టిప్రోలులో వేంచేసి యున్న శ్రీభ్రమరాంభ సమేత శ్రీమల్లేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి తొమ్మిది గంటలకు పొన్నమాను ఉత్సవంను ఘనంగా ప్రారంభించారు.రాత్రి గం 6 లకు శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర భక్త భజన సమాజం ఆర్గనైజర్ కొలుసు నాగమ్మ బృందం భజన కార్యక్రమం నిర్వహించారు. పొన్నమాను పై స్వామివారు పురవీధు లలో భక్తులకు దర్శనమిచ్చారు.అద్దేపల్లి గ్రామానికి చెందిన తిరువీదుల బాలాజీ,శ్రీధర్ ల ఆధ్వర్యంలో స్వామివారిని పొన్నమానుపై ప్రతిష్టించి గ్రామోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీలు కొడాలి లక్ష్మీ కాంతారావు, రామశాస్త్రి, పానకాలరావు, శంకరరావు, కార్యనిర్వహణాధికారి శనగవరపు కుమార్ బాబు,భట్టిప్రోలు-అద్దేపల్లి పద్మశాలియ బహుత్తమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే తాటిపత్రి సమావేశం



యర్రగొండపాలెం, మేజర్‌న్యూస్: వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజా ప్రతినిధులంతా గ్రామాల్లో మంచినీటి ఎద్దడిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం యర్రగొండపాలెం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ సర్పంచులకు వచ్చే నిధుల న్ని గ్రామాల్లో మంచినీటి ఎద్దడి నివారించేందుకు విని యోగించాలన్నారు. మరమ్మతులకు గురైన రోడ్లు,ట్యాం కులు,బోర్లు, పైపులైన్లకు మరమ్మతులు చేయించాలని తెలిపారు. నిధులు రాని సర్పంచ్లు ఎవరైనా ఉంటే జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా దగ్గరకు వెళ్లి ప్రత్యేక నిధులు తెచ్చుకునేందుకు కృషి చేద్దామన్నారు. అలాగే వైసీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూనే కూటమి ప్రభుత్వం తొమ్మిది నెలల కాలంలో సంక్షేమ పథకాలిస్తామంటూ మోసగించిన వైనాన్ని ప్రజలకు తెలియజేస్తూ చైతన్య పరచాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు ఏ చిన్న సమస్య వచ్చినా అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్క రించేందుకు కృషి చేయాలన్నారు.మీ అందరికి తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు మరిచారని ఎద్దేవా చేశారు. ఈ కార్య క్రమంలో వైసీపీ మండల కన్వీనర్ ఏకుల ముసలారెడ్డి, వైస్ ఎంపిపి ఆదిశేషు, పుల్లలచెరువు జడ్పిటిసి వాగ్యా నాయక్, సర్పంచ్లు రామావత్ అరుణాబాయి, సత్తిరెడ్డి, దుగ్గెంపూడి సుబ్బారెడ్డి,నాయకులు ఒంగోలు సుబ్బారె డ్డి, ఒంగోలు మురళీధర్ రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సింగా ప్రసాద్, కొప్పర్తి ఓబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నాటుసారా నిర్మూలనకు కృషి చేద్దాం



పెద్ద దోర్నాల, మేజర్‌న్యూస్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నాటు సారాయి నిర్మూలనకు ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మార్కాపురం ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎం.వెంకట రెడ్డి, ఎంఆర్ఓ కిన్నెర శాంతి, దోర్నాల, దోర్నాల పోలీస్ ఎస్సై వి.మహేష్‌లతో కలిసి, దోర్నాల గ్రామంలో హోల్ సేల్, రిటైల్ బెల్లం వ్యాపారస్తులతో మీటింగ్ నిర్వహించడం జరిగింది. ఈ మీటింగ్‌లో హోల్ సేల్ బెల్లం వ్యాపారస్తులు ప్రతి 15 రోజులకు ఒకసారి తమ వ్యాపారానికి సంబంధించిన క్రయ విక్రయాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌కి ఖచ్చితంగా ఇవ్వాలని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యమైన నాటు సారాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేం దుకు ప్రతి ఒక్కరూ వారి సహాయ సహకారాలు అందించాలని కోరారు. అలాగే నాటు సారా తయారు చేసే వారికి బెల్లం సరఫరా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడునని తెలపడం జరిగింది. తదుపరి దోర్నాల గ్రామంలో నాటు సారా నిర్మూలన కొరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది. నాటు సారాయిని మానేయాలని నాటు సార వలన కలుగు నష్టాల గురించి వివరించారు. పూర్తిగా నాటుసారాను రూపుమాపాలని నాటు సారా ఆరోగ్యానికి హానికరమని నాటుసారా వలన కలుగు అనర్థాలను వివరించారు.

# శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



అద్దంకి, మేజర్‌న్యూస్: ప్రసన్నాంజనేయస్వామి, లక్ష్మీనరసింహస్వామి వార్ల వార్షిక తిరుణాళ్ల సమన్వ యకమిటీ సమావేశానికి హాజరైన ఆర్డీఓ చంద్రశేఖర నాయుడు, డీఎస్పీ ఎం.డి. మొయిన్లు రెండు దేవాల యాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆశీర్వ చనం అందించగా సహాయకమిషనర్ శేషవస్త్రం సమర్పి ంచారు. అనంతరం ఆలయ ప్రాంగణం మొత్తం అధికా రులంతా కలియ తిరిగారు. భక్తులకు గాలి, వెలుతురు సక్రమంగా అందేలా అన్నిరకాల ఏర్పాట్లు చేయాలని సహాయ కమిషనర్ కు సూచించారు.

# మెగా జాబ్‌మేళాను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి



యర్రగొండపాలెం, మేజర్‌న్యూస్: పట్టణంలోని స్థానిక అంబేద్కర్ ఆడిటోరి యంలో ఈనెల 16వ తేదిన పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు యర్రగొండపాలెం ఎస్సై పి.చౌడయ్య తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు పివిఎస్ఆర్ గ్రూప్స్ సీఈవో పామర్తి గోపిచంద్ సారథ్యంలో ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నామన్నారు. పదో తరగతి పాసై వివిధ టెక్నికల్ కోర్సులు చేసిన వారందరూ ఉద్యోగాల కోసం ఈనెల 16వ తేది రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. అదే రోజు వివిధ కంపెనీల ఆధ్వర్యంలో ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం, పుల్లలచెరువు, పెద్దారవీడు, పెద్దదోర్నాల మండలాల్లోని నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొని ఉద్యోగ అవకాశాలు పొందాలని ఆయన కోరారు.

# అధికారుల సమన్వయంతో తిరునాళ్లు విజయవంతం



అద్దంకి, మేజర్‌న్యూస్: అధికార యంత్రాంగం సమన్వయంతో సమర్థంగా పని చేసి శింగరకొండ తిరుణాళ్లను విజయవంతం చేయాలని చీరాల ఆర్డీవో టి చంద్రశేఖరనాయుడు అన్నారు. బుధవారం ప్రారంభం కానున్న వార్షిక తిరుణాళ్లకు సంబంధించి రెండో సమన్వయకమిటీ సమావేశం ప్రసన్నాంజనే యస్వామీ ఆలయ కార్యాలయం వద్ద మంగళవారం సాయంత్రం జరిగింది. సభకు అధ్యక్షత వహించిన ఆర్డీవో మాట్లాడుతూ అధికారులంతా పరస్పరం సహకారం అందించుకుంటూ, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. సహాయ కమిషనర్ ఎం. తిమ్మానాయుడు వెంట రాగా ఆలయప్రాంగణాన్ని పరిశీలించారు. 14వ తేదీ ఆలయం వద్ద వాహనపూజలు పూర్తిగా నిలుపుదల చేయడం జరిగిందన్నారు. తిరుణాళ్లలో ఏర్పాటు చేసిన జెయింట్వేల్ వంటి పరికరాల సామర్థ్యాలను ఆర్డీవో తోపాటు డీఎస్పీ ఎండి. మొయిన్ తదితరులు పరిశీలించారు. విద్యుత్తు, ర.భ. శాఖ అధికారుల నుంచి ధృవపత్రాలు పొందాల్సి ఉందని నిర్వాహకులకు సూచించారు. ప్రసన్నాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన సమన్వయ కమిటీ సమావేశానికి లక్ష్మీనరసింహస్వామి ఆలయ అధికారులు గైర్హాజరు కావటం పట్ల ఆర్డీవో ఆరా తీశారు. కొండపై జరుగు తున్న నిర్మాణ పనులను పరిశీలించి బుధవారం నాటికి పూర్తిచేయాలని ఈఓ ఎస్.కోటిరెడ్డికి సూచించారు. కాగా తిరుణాళ్ల పూర్తిగా నిఘా కెమేరాలు, డ్రోన్ కెమేరా పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్లు చీరాల డీఎస్పీ ఎం.డి. మొయిన్ తెలిపారు. సమావేశంలో సీఐ ఏ సుబ్బరాజు, విద్యుత్తు ఈఈ నల్లూరి మస్తాన్ రావు, తహసీల్దార్ జీ శ్రీచరణ్, ఎంపీడివో బి.సింగయ్య, అగ్నిమాపక అధికారి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి కుటుంబం నుంచి పారిశ్రామికవేత్త



కర్లపాలెం, మేజర్‌న్యూస్: కర్లపాలెం మండలం స్థానిక మండలమహిళాసమాఖ్య కార్యాలయంలో మం డల సమాఖ్య సమావేశము ధనలక్ష్మి అద్యక్షతన నిర్వ హించారు.ఈకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బాపట్ల డి.పి.ఎం ఉసురపాటి సుబ్బారావు పాల్గొని మాట్లాడు తూ మహిళా సంఘాలు క్రమం తప్పక సమావేశాలు నిర్వహించుకోనుచు పొదుపులు, అప్పులు సకాలము లో చెల్లించాలన్నారు. ప్రభుత్వము మహిళా పక్షపాత ముతో జీవనోపాదుల మెరుగుకు ప్రాదాన్యత కల్పిస్తున్నా రని, ఈ క్రమంలో ప్రతిమహిళా ప్రభుత్వము సహకార ముతోబ్యాంకు అనుసందానము ,స్త్రినిది ,ఉన్నతి తోపాటు కేంద్రప్రభుత్వము ప్రత్యేకముగా ప్రవేసపెట్టిన రుణాలలో భాగముగా లఘుపతి ధీ ధీ ఆనుసరించి వ్యక్తిగత రుణాలకు ప్రాదాన్యము కల్పిస్తుందని సిబిల్ స్కోర్ చెక్ చేసుకొని ఏదైనా ఔత్సాహిక ఉత్పత్తి ,పారిశ్రామిక ,సేవా,వ్యాపార కార్యక్రమాలు నిర్వహించుకోను వారుముద్రా ,నారీశక్తి ,పి.ఎం.ఈ.జీ.పి ,ఆహార ఉత్పత్తుల కోసం రుణాలు పొందటానికి అవ కాశం కల్పించారని ,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి కుటుంభానికి ఒకపారిశ్రామిక వేత్త ను తయారు చేసే దిశగా పనిచెస్తున్నాయని మహిళాసంఘాల ఉత్పత్తులు స్టానిక అమ్మకాలు గ్లోబల్ మార్కెటింగ్ చేయతమం కోసం ' ఓ.ఎన్.డి.సి యాప్ ప్రవేశపెట్టినదని ప్రతిమహి లా ప్రభుత్వ పదకాలు అందిపుచ్చుకొని ప్రభుత్వ కలను నిజం చేయాలని కోరారు .ఈ కార్యక్రమం లో మం డలసమాఖ్య ప్రతినిధులు యు.నాగలక్ష్మి ,ఎ.శివలీల ఎ.పి.ఎం శ్రీనివాసులు రెడ్డి సి.సిలు సి.హెచ్.రాఘవులు ,కే.శివకోటేశ్వరావు , ఆర్.శివప్రభ అకౌంటెంట్ లక్ష్మి గ్రామసంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వైయస్సార్సీపి పోరాటాలతో పుట్టిన పార్టీ: కోన



బాపట్ల, మేజర్‌న్యూస్: నేడు నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్ర మం చిల్లరగొల్ల పాలెం కోన రఘుపతి నివాసంలో ఆవిష్కరించారు. అనంతరం వైయస్సార్సీపి సమన్వ యకర్త కోన రఘుపతి పత్రిక విలేకరులతో మాట్లాడుతూ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పుట్టుకే పోరాటాలతో పుట్టిన పార్టీగా పేరొందడంతో ఈనెల 12వ తేదీన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు ఉదయం 10 గంటలకు జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్నందున విద్యార్థులు తల్లిదండ్రులు, నిరుద్యోగ యువతతో బాపట్ల కలెక్టర్ కార్యాలయం వద్ద యువత పోరు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అనేక హామీలను ఇచ్చి అధికారం చేపట్టి ఇప్పటికే సుమారుగా 10 నెలలు పూర్తి కావస్తున్నప్పటికీ కూడా రాష్ట్రంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకునే పరిస్థితి లేక ఉద్యోగాల కల్పన లేకుండా, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా యువతను అలానే ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా దీవెన, వసతి దీవెనల బకాయిలు చెల్లించకుండా, వైద్య విద్యను ప్రైవేటీ కరిస్తూ విద్యార్థులను నిలువునా మోసగించిన కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి బకాయిలు చెల్లించేలా అన్ని జిల్లా కేంద్రాల్లో ఈనెల 12వ తేదీన యువత పోరు కార్యక్రమం చేపట్టాలని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు బాప`ట్ల జిల్లా కేంద్రం బాపట్లలో 12వ తేదీన భారీ నిరసన కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారం యువత పోరు పోస్టర్ విడుదల చేయడం జరిగిందని మాజీ ఎమ్మెల్యే కొన రఘుపతి తెలియజేశారు. పెద్ద ఎత్తున నిరుద్యోగ యువతీ యువకులను, విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వాములను చేయాలని కోరారు.

# సచివాలయాల్లో తనిఖీ



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: మండలంలోని పెదరాజుపాలెం, కోవిలంపాడు సచివాలయాలను మంగళవారం ఎంపిడిఒ ఎల్.బ్రహ్మయ్య ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలలో రికార్డులు పరిశీలించి పలుసూచనలు చేశారు. అనంతరం ప్రభుత్వం చేపట్టిన పి4 సర్వేను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయపాలన ఖచ్చితంగా పాటించాలని అదేవిధంగా ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనిచేసి ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజాసమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని గ్రామాల్లో వేసవి తీవ్రత దృష్ట్యా తాగునీటికి ఇబ్బందులు లేకుండా చేతిపంపులు, బోరు బావులు మరమ్మతులు చేపట్టాలని ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వాహణపై దృష్టిపెట్టాలని సిబ్బంది నిర్లక్ష్యం విడనాడాలని సూచించారు. అనంతరం పి4 సర్వే కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రానికి 100శాతం సర్వేపూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ బ్రహ్మయ్య, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

# రుషులు నడియాడిన పుణ్యభూమి పృధులగిరి



**13న స్వామి వారి గరుడ సేవ (తిరునాళ్లు)**

**గరుడు సేవలో పాల్గొననున్న వేలాది మంది భక్తులు**

**ఏర్పాట్లు చేస్తున్న ఆలయ కమిటీ నిర్వాహకులు**


మద్రిపూడి,మేజర్ న్యూస్: మండలం కేంద్రమైన మద్రిపూడిలోని శ్రీ "పృదులగిరి కొండపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 8వ తేదీ అంకురార్పణతో మొదలై 16వ తేదీ ఏకాంత సేవతో ముగుస్తాయి.13వ తేదీన జరిగే గరుడసేవ (తిరునాళ్ళ) ఉత్సవాలకోసం ఈవో నర్రా నారాయణరెడ్డి, ఆలయకమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారు. పూర్వకాలంలో ఋషులు ఈ కొండపై నివశించినట్లు స్థల పురానాల ద్వారా తెలుస్తోంది. కొండ ఆకృతి విరిసిన కమలం వలే ఉన్నందున ఈ కొండకు పృధులగిరి అనే పేరు వచ్చిందని చెబుతుంటారు. ఇక్కడి గృహాలు, దోనలు భక్తులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. పుదులగిరిపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు విలవేల్పు శివుడు విష్ణు దేవాలయాలు ఒకే స్థానంలో ఉండడం వల్ల ఇక్కడి బ్రహ్మోత్సవాలకు ప్రత్యేకతను సంతరించుకుంది. అహోబిల క్షేత్రం తర్వాత శివ, విష్ణువులు ఒకే చోట ఉండడం విశేషం. తులగిరిని పంచనాద్రి పేరుతో కూడా కొండ ప్రదేశంలో వాతావరణం చాలా ప్రశాంతంగా ఉండడంవల్ల మునులు సిద్ధులు ఇక్కడ నివసిస్తూ శివలింగం ప్రతిష్టించి దానికి నిర్మామహేశ్వరుడు అని నామకరణం చేసి నాలుగు దిక్కులా నాలుగు లింగాకృతులు ప్రతిష్టించడంతో పంచనాధ్రి పేరు వచ్చిందని భక్తులు చెబుతుంటారు. 1400ల ఏళ్ళ క్రితం తొలి చాళిక్యులకాలంగా దేవుని గర్భగుడి, ఆలయ మండప నిర్మాణం, గణపతి, నందీశ్వరుని విగ్రహాలను ప్రతిష్టించారు. స్వామి వారి భక్తుడైన సాలువరాయులు 1450-60 మధ్య కాలంలో పృధుల సీమను పాలించిన సమయంలో పృధుల గిరి పైన గుడి కోనేరు ప్రవహిస్తుండడంతో ఇది కూడా అహోబిల క్షేత్ర ప్రభావాన్ని సంతరించుకుందని చరిత్ర చెబుతోంది. 1914-15లో తాడివారిపల్లి అయ్యవారుల రామకవచం లక్ష్మి నారాయణ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మి నాయుడి ప్రతిష్టించారు. 19వ శతాబ్దంలో వెంకటగిరి రాజా వారు దేవస్థానానికి ప్రధాన ధర్మకర్తగా గుర్తింపు పొందిన తర్వాత గాలిగోపురం,దేవాలయం పునురోద్ధరణ జరిపించి 136 ఎకారాల మెట్ట భూమిని దానం చేశారని చెబుతున్నారు. అయితే దశాబ్ద కాలం క్రితం వరకు ఇక్కడ నరసింహ క్షేత్రం ఒక్కటే ఉండేదని బ్రహ్మోత్సవాలు జరిగే సమయంలో ప్రజలు ఆ గుడికి చేరి ఉత్సవాలు నిర్వహిస్తూ దక్షణ ప్రాంతంలోని కొంత ఎత్తైన ప్రదేశంలో బసచేసేవారు.దీని సమీపాన లింగాకృతిలో ఒక శిల ఉంది.దీనికి సమీపంలో సత్రం



నిర్మించాలనే ఉద్దేశ్యంతో తవ్వుతుంటే పూర్వం ఇటుకలతో కట్టిన ఆలయ లింగాకృతి కనిపించింది. తర్వాత ఆలయ పునాదులు, అయ్యవారి దేవాలయం, గణపతి, నందీశ్వరునితో పాటు మరికొన్ని విగ్రహాలు తవ్వకాల్లో లభించాయి.వీరు నిర్మించిన ఆలయాలు పూర్తిగా శిధిలం కావడంతో - 1952లో పెదారికట్ల గ్రామానికి చెందిన లక్ష్మయ్య, న రసింహ శ్రేష్టి అనే వ్యక్తులు ఆలయాలను పునఃనిర్మించారు. 40 ఏళ్ళ క్రితం వర్షాలు లేక త్రీవ కరువు ఏర్పడినప్పుడు ఈశ్వరునికి కోనేరు త్రవ్వించి అభిషేకాలు చేయగా వర్షాలు కురిశాయని ప్రజలు చెబుతుంటారు.

### విశేష ప్రాధాన్యతను సంతరించుకున్న సీతమ్మవారి పాదాలు

పృధులగిరి కొండపైకి మెట్ల పైనుండి వెళ్ళే మార్గంలో మధ్యలో ఉన్న సీతమ్మవారి పాదాలు తిరునాళ్ళ సమయంలో విశేష ప్రాధాన్యత సంత రించుకుంటాయి. స్వామి వారిని దర్శించుకొనే ముందే సీతమ్మ వారి పాదాలకు పాలు,వెన్న, నెయ్యితో అభిషేకం చేసి మొక్కులు తీర్చుకుంటారు.ముఖ్యంగా స్త్రీలు ఈ పూజలను జరుపుతూ తమ కోర్తెలను మనస్సులో తలచుకుంటే మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం. లక్ష్మి నరసింహ స్వామి వద్దకు వెళ్ళే ప్రతి భక్తుడు సీతమ్మవారి పాదాలు దర్శించుకోవడం అనవాయితీ.



### పెరుగుతున్న బచ్చలదొన ప్రత్యేకత


పృధులగిరి కొండపైన శివ, విష్ణు క్షేత్రాలు, పంచలింగాలు, కోనేరు తర్వాత బచ్చలదొన ప్రత్యేకతను సంతరించుకుంది, కొండకు దక్షణ దిశలో రాళ్ళ గుట మధ్య దీనిని చూసేందుకు చాలా ఆకర్షణీయంగా ఉంటుంది. చిన్న రంధ్రంగా ఉన్న ఈ దొనల్లో వేసవిలో కూడా నీరు సంవృద్ధిగా లభించడం విశేషం.తియ్యగా,చల్లగా ఇక్కడ నీరు ఉంటుంది. కొండపైకి వెళ్ళే భక్తులు ఈ బచ్చల దొన గురించి ప్రత్యేకంగా చెప్పుకుంటారు. ఇప్పటికీ వృద్ధులు చనిపోయే ముందు చివరి కోరికగా బచ్చల దొన నీరు కావాలని అడుగుతుంటారు. మునులు ఇక్కడ నివశిస్తూ తపస్సు చేసుకొనే రోజుల్లో బచ్చలదొన నీటిని ఉపయోగించుకొనే వారని ప్రజలు చెబుతుంటారు. తిరునాళ్ళ సమయంలో ఈ నీటిని త్రాగితే పుణ్యం కలుగుతుందని ప్రజల నమ్మకం.

### పృధులగిరికి చేరుకోవడం ఇలా

మద్రిపూడి నుండి ప్రత్యేక వాహనాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన రహదారి గుండా కొండకు చేరుకోవచ్చు. అలాగే పొదిలి నగర పంచాయతీ లోని రాజాపాలెం గ్రామం నుండి దాత శ్రావణి వెంకటేశ్వర్లు సొంత నిధులతో ఏర్పాటు చేసిన రహదారి మార్గం నుండి ప్రత్యేక వాహనాల్లో పృధులగిరి క్షేత్రానికి చేరుకోవచ్చు. పృధులగిరి క్షేత్రంలో వాతావరణం అందరినీ విశేషంగా ఆకట్టుకుంటుంది.

## కనిగిరి అభివృద్ధికి సహకరించాలి

### సీఎంకు ఎమ్మెల్యే ఉగ్ర వినతి



కనిగిరి, మేజర్‌న్యూస్: నియోజకవర్గ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించాలని సీయం చంద్రబాబు నాయుడును ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి కోరారు. ఫ్లోరోసిస్ సమస్యకు పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు హాస్టల్ సదుపాయాలు మెరుగుపరచాలని, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి నిధులు కేటాయిం చాలని, డయాలసిస్ సెంటర్ ఆధునీకరణకు చర్యలు తీసుకుని నిధులు కేటాయించాలని, బిసీ హాస్టల్‌కు శాశ్వత భవనం నిర్మాణం చేపట్టేందుకు నిధులు కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించి ఈ అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన నిధుల కేటాయింపునకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అంగీకారం తెలిపినట్లు ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు.

## జిల్లా సబ్ జూనియర్ బాల బాలికల కబడ్డీ జట్ల కోఆర్డినేటర్‌గా కొక్కిలిగడ్డ భగవాన్



ఒంగోలు, మేజర్‌న్యూస్ : ప్రకాశం జిల్లా సబ్ జూనియర్ బాల బాలికల కబడ్డీ జట్ల కోఆర్డినేటర్‌గా కొక్కిలిగడ్డ భగవాన్ నియమి తులైయ్యారు. 34వ సబ్ జూనియర్ బాలబాలికల రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ఈనెల 14, 15, 16 తేదీల్లో వైఎస్ఆర్ కడప జిల్లా పులివెందు లలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ప్రకాశం జిల్లా జట్లకు కొక్కిలిగడ్డ భగవాన్ కో ఆర్డినేటర్‌గా నియమిస్తున్నట్లు ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ ఎన్. చంద్రమోహన్ రెడ్డి, అధ్యక్ష,కార్యదర్శులు కుర్ర భాస్కర్ రావు, వై. పూర్ణచంద్రరావు, ట్రెజరర్ దాసరి రమేష్ తెలియజేశారు. ఈ సందర్భంగా భగవాన్‌కి సభ్యులు, మిత్ర బృందం అభినందనలు తెలియజేశారు.

## భైరవకోనలో డిఎస్పీ సాయి ఈశ్వర్ దంపతులు పూజలు



సి,ఎస్.పురం, మేజర్‌న్యూస్: ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పర్యాటక శైవక్షేత్రమైన భైరవకోనలో సోమవారం రాత్రి కనిగిరి డియస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ముందుగా స్థానిక జలపాతం వీక్షించి అనంతరం శ్రీత్రిముఖ దుర్గభర్గులేశ్వరస్వామి, కాలభైరవేశ్వరస్వామి, నగరేశ్వరస్వామి, ఇతర శివలింగాలను దర్శించుకుని అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం కార్యనిర్వాహణాధికారి డి.వంశీకృష్ణారెడ్డి, దేవస్థానం నిర్వాహకులు, ప్రతిపాద చైర్మన్ ముప్పాళ్ల శ్యామసుందరరాజు సూచనల మేరకు దేవస్థానం అర్చకులు డియస్పీ సాయి ఈశ్వర్‌యశ్వంత్ దంపతులను కుటుంబ సభ్యులను దేవస్థానం శేషవస్త్రంతో సత్కరించి ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డియస్పీ దంపతులు, కుటుంబ సభ్యులు, పామూరు సిఐ భీమానాయక్, స్థానిక యస్ఐ సుమన్, పోలీసు సిబ్బంది, దేవస్థానం అర్చకులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలలు తనిఖీ



చీరాల, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని చీరాలలో పలు పాఠశాలను రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యురాలు భక్తుల పద్మావతి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులు, పాఠశాల ప్రాంగణాలను పరిశీలించి విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. పట్టణంలోని భాష్యం స్కూల్లో కంప్లైంట్ బాక్స్ లేకపోవడం, బాత్రూం డోర్స్ లేకపోవడంతో యాజమాన్యంపై అధికారి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజుల విషయంలో రాజీపడని పాఠశాలలు వసతులు కల్పించడంలో ఎందుకు నిర్లక్ష్యంగా ఉంటారని ప్రశ్నించారు. ఎవరైనా విజితో పాటు బస్సులు కూడా కల్పించాల్సిన బాధ్యత ప్రైవేట్ పాఠశాలపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ సుబ్రహ్మణ్యేశ్వర రావు, సిబ్బంది ఉన్నారు.



## మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలి

### సిపిఎం జిల్లాకార్యదర్శి ఎస్‌కె మాబు

### వినోదరాయినిపాలెంలో పర్యటించిన ప్రజా చైతన్యయాత్ర


నాగులుప్పలపాడు, మేజర్‌న్యూస్: ప్రజాసమస్యలు తెలుసుకొనేందుకు సిపియం చేపట్టిన ప్రజా చైతన్యయాత్ర మంగళవారం మండలంలోని వినోదరాయినిపాలెంలో పర్యటించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు వారు పడే కష్టాలను చైతన్య యాత్ర బృందం ఎదుట వినిపించారు. నాగులుప్పలపాడు మండలంలో కనపర్తి ఎత్తిపోతలపదకం క్రింద అమ్మనబ్రోలు, కనపర్తి, దాసరివారిపాలెం, వినోదరాయిని పాలెం, మాచవరం, రాపర్ల, చవటపాలెం,తదితర గ్రామాలకు సంబందించి ఘమారు 4 వేల ఎకరాల్లో సాగుచేశారు. అదే విథంగా తిమ్మసముద్రం, ముప్పాళ్ళ, ఉప్పుగుండూరు, ఈదుమూడి మట్టిగుంట తదితర గ్రామాల్లో కొమ్మమూరుకాలువ, పంపింగ్ స్కీము ,చెరువుల ద్వార మరో 5వేల ఎకరాల్లో మాగాణి సాగుచేశారు. ప్రధానంగా ఈప్రాంతంలో ఖరీప్ చివరిలో సాగుచేశారు. ప్రస్తుతం ఈప్రాంతంలో గత 20 రోజులుగా నూర్పిళ్ళు జరుగుతున్నాయి. ప్రభుత్వం అధికారులను వ్యవసాయ అధికారులను కొనుగోలు కేంద్రాలను తెరవమని అడిగితే ఖరీప్ కోటా అయిపోయిందని రబీ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని చెబుతున్నారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా అద్యక్షులు జె. జయంతిబాబు మాట్లాడుతూ మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. సిపియం జిల్లాకార్యదర్శి ఎస్‌కె మాబు మాట్లాడుతూ కనపర్తి ఎత్తిపోతుల పథకం క్రింద రైతుల పరిస్దితి ప్రజాచైతన్య యాత్ర పర్యటన సందర్భంగా చూస్తుంటే దయనీయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఖరీప్ చివరలో సాగుచేస్తారని పంట మొత్తం పూర్తిగా ఇంటికి చేరాయని ఎప్రిల్ వరకు ఆగేపరిస్దితి లేదని వాతావరణం రోజు రోజుకు మారుతుందని దీంతో పంటను దాచుకోలేక ప్రయివేట్ వ్యాపారుల చేతిలో దగాపడుతున్నారని వెంటనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి మద్దతూ ధరకు కొనుగోలు చేసి ఆదుకోవాలని లేనిచో రైతులను సమీకరించి చేపట్టే ఆందోళనకు ప్రభుత్వమే భాద్యత వహించవలసి ఉంటుందని హెచ్చరించారు.

## సీఎం సహాయనిధి పేదలకు వరం



రేపల్లె, మెజర్‌న్యూస్: పేదల ఆరోగ్య అవసరాలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరమని రెవిన్యూ శాఖ మంత్రి సోదరులు అనగాని శివప్రసాద్ అన్నారు. బుధవారం టీడీపి కార్యాలయంలో అనారోగ్య కారణాలతో బాధపడుతున్న మైలవరం గ్రామానికి చెందిన సురవరపు సోమయాజులు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ. 14,51,610 రూపాయల చెక్కు ను సోమయాజులు కుటుంబసభ్యులకు అందజేశారు. చెక్కులు పంపిణీ చేసిన వారిలో జనసేన సమన్వయ కర్త మత్తి భాస్కర్ నిజాంపట్నం మండల జనసేన అధ్యక్షులు మైలా నరేష్ తదితరులు ఉన్నారు.

## స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం



రేపల్లె, మెజర్‌న్యూస్: నిరుద్యోగ యువతీ యువకులు స్వయం ఉపాధి పథకాలపై దరఖాస్తులు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరము బిసి వార్షిక ప్రణాళికలో భాగముగా బి.సి, కాపు, ఇ.డబ్ల్యు.ఎస్ కులములైన కమ్మ, రెడ్డి, క్షత్రియ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ కులములలో పేద వారికి స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం సబ్సిడీ రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. మినిడైరి, గొర్రెల పెంపకం, ఆటో రిక్షాలు, చిన్న చిన్న పరిశ్రమలు వంటి పథకాలకు, జనరిక్ మందుల షాపుల ఏర్పాటుకు సబ్సిడీతో బ్యాంకు రుణాలు అందజేయనున్నట్లు చెప్పారు. 21 నుండి 60 సంవత్సరముల మధ్య అర్హులైన అభ్యర్థులు ఆన్లైన్లో ఈ నెల 22వ తేదిలోగా సంబంధిత సచివాలయములలోగాని, మీ సేవా సెంటర్లలోగాని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## యువత పోరుబాట పోస్టర్ ఆవిష్కరణ



వెలిగండ్ల, మెజర్‌న్యూస్: మండల కేంద్రంలో మంగళవారం వైసీపీ నేతల సమావేశం జరిగింది. ఈ నేపథ్యంలో వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు బుధవారం కనిగిరి వైసీపీ ఇంచార్జ్ దద్దాల నారాయణ యాదవ్ ఆదేశాలతో జడ్పీటీసీ గుంటక తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నేతలు 'యువత పోరుబాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గజ్జల వెంకటరెడ్డి, వెలిగండ్ల సర్పంచ్ తాతపూడి సురేష్ బాబు, జేసీఎస్ కన్వీనర్ పొల్లా సుబ్రహ్మణ్యం, బీసీ సెల్ అధ్యక్షుడు ఎలిక రవణయ్య, ఎయంసి మాజీ డైరెక్టర్ బొబ్బా వెంకట రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట రామయ్య, సోమయ్య, మోహనరెడ్డి, గజ్జల నాగిరెడ్డి, బాలస్వామి, కమల్ వలి, తదితర నాయకులు, కార్యకర్తలు, వైసీపీ అభిమానులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలు పట్ల విద్యార్థులకు అవగాహన



నిజాంపట్నం, మెజర్‌న్యూస్: సైబర్ నేరాలపట్ల నిజాంపట్నం ఎస్సై కే. తిరుపతిరావు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం మండలంలోని ఆముదాలపల్లి గ్రామంలో ఎంపీ యూపీ పాఠశాల విద్యార్థులకు మహిళా రక్షణకు సంబంధించి ప్రభుత్వం కొత్తగా శక్తి యాప్ ను ప్రవేశపెట్టిందన్నారు. ఈ యాప్ యొక్క ప్రాముఖ్యత మరియు సైబర్ నేరాలు పట్ల, ఈవ్-టీజింగ్ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# యువత పోరు అంటూ కొత్త నాటకం

### బీజేపీ నాయకుడు డాక్టర్ ఏలూరి



మార్కాపురం, మెజర్‌న్యూస్: విద్యా వ్యవస్థని సమూలంగా నాశనం చేసిన వైసీపీ నేతలు యువత ఫీజు పోరు అంటూ కొత్త నాటకానికి తెరలేపారని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి దుయ్యబట్టారు. వైసీపీ నేతల పాలనాతీరు కారణంగా చాలావరకు విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వారి హయాంలో విద్యార్థులకు ఫీజులు చెల్లించకుండా వారి జీవితాలతో ఆటలాడారని విమర్శించారు. ఈ సందర్భంగా కొన్ని లెక్కలతో సహ వివరించారు. వైసీపీ హయాంలో ఫీజు బకాయిలు చాలా వరకు అలాగే ఉన్నాయన్న ఏలూరి.. ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద - రూ.2,832 కోట్లు, వసతి దీవెన బకాయిలు - రూ.989 కోట్లు, పీజీ ఫీజ్ రీయింబర్స్‌మెంట్ - రూ.450 కోట్లు , మొత్తం - రూ.4,271 కోట్లు పెండింగ్ పెట్టారని లెక్కలతో సహ వివరించారు. ఎన్డీఏ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాతే ప్రస్తుత విద్యా సంవత్సరానికి గాను రూ. 788 కోట్లు ఫీజులు నేరుగా కాలేజీలకు చెల్లించారని గుర్తుచేశారు. మరోవైపు గత పాలనలో పెట్టిన బకాయిలు కూడా క్రమ పద్ధతిలో విడుదల చెయ్యడానికి కాలేజీలతో మాట్లాడి విడతల వారీగా ఇవ్వడానికి ప్రభుత్వం అంగీకరించిందని గుర్తు చేసారు. అయితే ఇవేవి పట్టించుకోకుండా విద్యార్థులని రెచ్చగొట్టి తద్వారా రాజకీయ లబ్ధికి వైసీపీ నేతలు యత్నిస్తున్నారని వారి మాయలో పడవద్దని సూచించారు. విద్యా వ్యవస్థని ఇన్ని రకాలుగా ఇబ్బందులు పెట్టి నేడు వారికోసమే తాము పోరాటం చేస్తున్నామనడం బాధాకరమన్నారు ఏలూరి రామచంద్రారెడ్డి.

## కిట్స్‌లో మంగో డీ బీ వర్క్‌షాప్



మార్కాపురం, మెజర్‌న్యూస్: కృష్ణ చైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ సి ఎస్ సి విభాగం ఆధ్వర్యంలో "మంగో డి బిపై వర్క్‌షాప్ ఏర్పాటు చేయబడింది. ఈ వర్క్‌షాప్ 2025 మార్చి 11 నుండి 2025 మార్చి 18 వరకు జరుగనుంది. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు కిట్స్ కళాశాల ఎప్పుడూ ముందుంటుందని కళాశాల యాజమాన్యం తెలిపింది.ఈ వర్క్‌షాప్‌లో విద్యార్థులకు మంగో డి బి డేటాబేస్ పై ప్రాక్టికల్ అనుభవం కల్పించబడుతుంది. ఇండస్ట్రీ నిపుణులు మంగో డి బి ప్రాముఖ్యత, వినియోగం, రియల్-టైమ్ అప్లికేషన్లపై అవగాహన కల్పించనున్నారు. కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం డీన్ మాట్లాడుతూ, "మా విద్యార్థులు పరిశ్రమలో జరుగుతున్న తాజా పరిణామాలను తెలుసుకోవడానికి, ప్రాక్టికల్ పరిజ్ఞానం పొందేందుకు ఇలాంటి వర్క్‌షాప్‌లు ఎంతో ఉపయోగపడతాయి" అని పేర్కొన్నారు.ఇంజినీరింగ్ విద్యార్థులు తమ టెక్నికల్ నైపుణ్యాలను పెంచుకునేందుకు ఇది ఉత్తమ అవకాశం. ఆసక్తి గల విద్యార్థులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొని ప్రయోజనం పొందవచ్చు.

## రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పశువుల కాపరులకు అవగాహన



గిద్దలూరు, మెజర్‌న్యూస్: రైల్వే రక్షక దళం ఇన్స్పెక్టర్ ఈ.నాగభూషణ ఆదేశాల మేరకు గిద్దలూరు మండలంలోని కృష్ణంశెట్టి పల్లె, చుట్టుపక్కల గ్రామ ప్రజలకు, పశువుల కాపరులకు, రైతులకు అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సబ్ ఇన్స్పెక్టర్ కే.పిచ్చిరెడ్డి మాట్లాడుతూ రైలు పట్టాల వెంబడి పశువులను మేతకు ఎవ్వరూ తోలుకొని వెళ్లవద్దని, మీరు పశువులను రైలు పట్టాల వెంబడి మేతకు తీసుకెళ్లినప్పుడు నోరులేని మూగ జీవాలు ప్రమాదానికి గురై చనిపోతుంటాయని దీనివల్ల మీకు నష్టం జరుగుతుంది. రైలు కానీ గూడ్స్ కానీ వెళ్లేటప్పుడు మూగజీవాలు వాటి కిందపడి రైలుకు కూడా ప్రమాదం జరిగే అవకాశం ఉంటుందని దీనివల్ల భారీగా ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరిగే అవకాశం ఉంటుందని దయచేసి ఎవ్వరూ పశువులను మేతకు రైలు పట్టాల వెంబడి కానీ రైలు వెళ్ళు ప్రాంతానికి దగ్గరగా గాని తీసుకొని వెళ్లకుండా దూరంగా పశువులను మేతకు తీసుకొని వెళ్ళాలని కోరారు. ఒకవేళ ఎవరైనా చట్టాన్ని అతిక్రమించి ప్రవర్తిస్తే వారిపైన చట్టపరమైన చర్యలను తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్ ఎస్.శేషయ్య, పశువుల కాపరులు, రైతులు, చుట్టుపక్కల గ్రామాలలోని ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక విద్యాభ్యాసం నుంచే ప్రతిభను మెరుగుపర్చుకోవాలి



నగరం, మెజర్‌న్యూస్ : మండల పరిధిలోని పూడివాడ శ్రీ అచ్యుత ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలల్లో 5, 7 తరగతులు చదువుతున్న విద్యార్థులకు మంగళ వారం ప్రతిభా పరీక్ష నిర్వహించారు. పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు లాజరు, వీరాంజనేయులు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో విద్యార్థులు నిలబడాలంటే ప్రాథమిక విద్యాభ్యాసం నుంచే కృషి చేస్తూ, ప్రతిభను మెరుగుపర్చుకోవాలన్నారు. 7వ తరగతిలో పూడివాడ ఎస్ఏయూపి పాఠశాల విద్యార్థి ఎ. దేవర్షకుమార్‌రెడ్డి, ఉల్లిపాలెం ఎజడ్పి హైస్కూలు విద్యార్థి ఎస్. నీహారికలు సంయుక్తంగా ప్రథమ స్థానంలో నిలిచారు. ఉల్లిపాలెం ఎజడ్పి హైస్కూలు విద్యార్థులు వి. పూజిత (ద్వితీయ), ఎస్‌కె. రీహాన్ (తృతీయ) స్థానాలను కైవసం చేసు కొన్నారు. 5వ తరగతిలో దాసరిపాలెం ఎంపీపీ పాఠశాల విద్యార్థి పి. మౌనిక (ప్రథమ), ఉల్లిపాలెం ఎంపీపీ పాఠశాల (స్పెషల్) విద్యార్థి ఎం. నిశ్చిత బ్లాండీల్ (ద్వితీయ), మంత్రి పాలెం ఎంపీపీ పాఠశాల విద్యార్థి బి. లాస్యశ్రీ (తృతీయ) స్థానంలో నిలిచారు. విజేతలకు బహుమతులు సమకూర్చిన పాఠశాల ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్‌లకు కరస్పాండెంట్ యల్లాప్రగడ శ్యామసుందరం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్యోత్స్న, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు యల్లాప్రగడ సీతాపతి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, ఉపాధ్యాయులు గాయత్రి, వీర్లంకమ్మ, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సబ్ రిజిస్టర్‌పై దాడి

గిద్దలూరు, మెజర్‌న్యూస్: పట్టణంలోని సబ్ రిజిస్టర్ కృష్ణమోహన్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. పట్టణంలోని శర్మ వీధిలో నివసిముంటున్న సబ్ రిజిస్టర్ కృష్ణమోహన్ తన ఇంట్లో ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలోకి ప్రవేశించి దాడికి పాల్పడ్డారు. తర్వాత అతని మొబైల్ ఫోను 12 వేల రూపాయలు నగదును దాడి చేసిన వ్యక్తులు తీసుకొని పరారయ్యారు. దీంతో సబ్ రిజిస్టర్‌కు గాయాలయ్యాయి. సబ్ రిజిస్టర్ కృష్ణమోహన్ తనపై గుర్తుతెలియని వ్యక్తులు దాడికి పాల్పడినట్లుగా గిద్దలూరు అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు సబ్ రిజిస్టర్‌పై జరిగిన దాడిపై విచారణ చేపట్టారు. సబ్ రిజిస్టర్ ఇంటి పరిసరాలను పరిశీలించారు. సబ్ రిజిస్టర్ కృష్ణమోహన్ తలకు బలమైన గాయం కావడంతో అతనిని గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తలకు నాలుగు కుట్లు పడినట్లుగా వైద్యులు తెలిపారు. తన ఇంట్లో రిజిస్ట్రేషన్ గురించి మాట్లాడడానికి వచ్చామని చెప్పి గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు తనపై దాడికి పాల్పడినట్లుగా సబ్ రిజి స్టర్ కృష్ణమోహన్ మీడియాకు తెలిపారు అలానే నిందితులు తన తలకు బలమైన గాయమై టీ షర్ట్ అంత రక్తంతో తడిసిపోగా ఆ టీ షర్ట్ బలవంతంగా విప్పి తీసుకువెళ్లారని అంతేకాకుండా తనను కొడుతున్న సమయంలో ఓ వ్యక్తి మొబైల్‌లో వీడియో చిత్రీకరించినట్లుగా తెలిపారు. సబ్ రిజిస్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని గిద్దలూరు అర్బన్ సీఐ సురేష్ తెలిపారు.

## మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేత




నిజాంపట్నం, మెజర్‌న్యూస్: కూచినపూడి పంచాయతీ లింగనేని వారిపాలెంలో గౌడపాలెంకు చెందిన టిడిపి నాయకుడు మోర్ల గిరిబాబు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం తన స్వగృహం లింగనేని వారిపాలెంలో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న రాష్ట్ర రెవెన్యూ మరియు స్టాంపుల శాఖ మంత్రి అగాని సత్యప్రసాద్ ఆదేశాల మేరకు మరియు నియోజకవర్గ టిడిపి నాయకులు అనగాని శివప్రసాద్ సూచనల మేరకు కూచినపూడ లింగనేనివారిపాలెం టిడిపి నాయకుడు కేశన ఎల్లారయ్యా మృతుని కుటుంబాన్ని పరామర్శించి పార్టీ ఎల్లప్పుడు మీ కుటుంబానికి అండదండలుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులకు రూ 26 వేల నగదును ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రం, ఎం శ్రీను, ఎం రామారావు, కే నాగరాజు, కిషోర్, మురళీకృష్ణ, ఎం. రాజు, ఎం. నాగేంద్రబాబు, కే. వెంకటేశ్వరరావు, ఎం. వెంకయ్య, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫారాలు అందజేత



కర్లపాలెం, మెజర్‌న్యూస్ : కర్లపాలెం పంచా యతీ పారిశుధ్య కార్మికులు 8 మందికి యాక్షన్ టవర్స్ నిర్వాహకులు హైదరాబాద్ వలి నూతన యూనిఫాం అందజేశారు.పరులకు సేవ చేయడమే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## 16 నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం



అద్దంకి, మెజర్‌న్యూస్ : అద్దంకి పురపాలక సంఘం పరిధిలో ఈనెల 16 నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం నిషేధించినట్లు కమిషనర్ డి. రవీంద్ర తెలిపారు. ఆమేరకు పట్టణంలోని పలువురు వ్యాపార వర్గాల వారితో మంగళ వారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి నెల మూడవ శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర దినం నిర్వహిస్తున్నాను న్నారు. ఈనెల 3వ శనివారం నాడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించను న్నట్లు తెలిపారు. 16వ తేదీ తరువాత ప్లాస్టిక్ వినియోగించినా, అమ్మినా చట్టప రమైన చర్యలు చేపడతామన్నారు. పట్టణ ప్రజలందరూ ప్లాస్టిక్ సంచులకు బదు లుగా గుడ్డ సంచులు వాడాలని సూచించారు.

## నాగెండ్లముడుపు, ఉమ్మరెడ్డిపల్లె గ్రామాలలో 'పొలం పిలుస్తుంది'



తర్లుపాడు, మేజర్‌న్యూస్: మండలంలోని నాగెండ్లముడుపు, ఉమ్మరెడ్డిపల్లె గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ అధికారి టి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రబీ 2024కు సంబంధించి ఈ పంట నమోదు చేసిన లిస్టును అన్నీ రైతు సేవ కేంద్రాలలో సోషల్ ఆడిట్ కొరకు ప్రదర్శించడం జరిగిందని, రైతులందరూ తమ ఈ పంట వివరాలను సరిచూసుకొనవలెనని కోరారు. అలానే ఫార్మర్ రిజిస్ట్రేషన్ నందు మిగిలిన రైతులు 11 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్యకు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకొనవలెనని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామ సహాయక సిబ్బంది దేవేంద్ర, వెంకట సుబ్బమ్మ, పుణ్యవతి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## మానవతకు విరాళం అందించిన కాటూరి పెదబాబు దంపతులు



పొదిలి, మేజర్ న్యూస్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ భవన నిర్మాణానికి మాజీ జడ్పిటిసి, మానవతా డైరెక్టర్ కాటూరి వెంకటనారాయణ బాబు, మాజీ సర్పంచ్ కాటూరి మాధురి దంపతులు రూ.1,10,116ల విరాళం అందజేశారు. మంగళవారం మానవత కొత్త భవనం వద్ద నగదును మానవతా కమిటి కి అందజేశారు. విరాళం అందజేసిన కాటూరి పెద్ద బాబును మానవతా సంస్థ ప్రతినిధులు అభినందించారు. కార్యక్రమంలో మానవత సంస్థ జిల్లా కార్యదర్శి కే ఎలమందరెడ్డి, పొదిలి కన్వీనర్ కల్లం వెంకటసుబ్బారెడ్డి, మానవతా సంస్థ పొదిలి అధ్యక్షులు నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బండి అశోక్, కోశాధికారి సోమిశెట్టి చిరంజీవి, ప్రతినిధులు భవాని శ్రీనివాసులు, తాడికొండ వెంకట్రావు, వెంకటేశ్వర రెడ్డి, బాజీ తదితరులు పాల్గొన్నారు.

## శివాపురంలో సీసీ కెమెరాలు ఏర్పాటు

పెద్దారవీడు, మేజర్‌న్యూస్: మండలంలోని శివాపురం గ్రామంలో ఎస్పీ దామోదర్‌కి ఇచ్చిన మాట ప్రకారం టీడీపీ యువ నాయకులు ఆనెకాళ్ళ శ్రీనివాస రెడ్డి 16 వేల రూపాయలతో గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఎస్సై అనిల్ కుమార్ శ్రీనివాసరెడ్డిని అభినందించారు.



# యువత జీవితాలను నాశనం చేసిన ఘనత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీదే

### టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్ బాషా



పొదిలి, మేజర్‌న్యూస్: యువత జీవితాలను నాశనం చేసిన ఘనత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందని జిల్లా టిఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి షేక్ గౌస్ బాషా అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ పోరుతో' దొంగాట ఆడుతుందని విమర్శించారు. గత వైయస్సార్ ప్రభుత్వంలో రూ.4, 271కోట్లు ఫీజు, వసతి దీవెన బకాయిలు పెట్టిందని మండిపడ్డారు .2014-19 మధ్య చంద్రబాబు ప్రభుత్వం 16లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ ఇచ్చారని చెప్పారు.దాన్ని జగన్ 9లక్షల మందికే కుదిరించి. 7లక్షల మంది విద్యార్థులకు అన్యాయం చేశారని మండిపడ్డారు. 6లక్షల మందికి చంద్రబాబు ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇవ్వగా, దాన్ని జగన్ ప్రభుత్వం రద్దు చేసి యువతకు ద్రోహం చేసిందన్నారు. 2.30లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ, ప్రతి ఏటా జనవరిలో జాబ్ కేలండర్, మెగా డీఎస్సీ హామి పై, జగన్ మాట తప్పి, మడమ తిప్పారని పేర్కొన్నారు. కమిషన్ల కోసం పరిశ్రమలపై దాడులు చేసి, పెట్టుబడుల్ని పొరుగు రాష్ట్రాలకు తరిమేసి జగన్ ప్రభుత్వం నిరుద్యోగం పెంచిందని ఆరోపించారు.బీసీ, ఎస్సీ, ఎస్టీ,మైనారిటీ సబ్ ప్లాన్ నిధులు ఒక (లక్ష) కోట్లు దారి మళ్లించి. స్వయం ఉపాధి పథకాలు నీరుగార్చారన్నారు. రాజకీయ స్వార్థంకోసం స్కిల్ డెవ ప్మెంట్ సెంటర్ల పై దుష్ప్రచారం చేసి వాటిని నాశనం చేసి నిరుద్యోగం పెరిగేలా చేశారని విమర్శించారు. జగన్ పాలనలో ఎన్ సి ఆర్ బి నివేదిక ప్రకారం వైకాపా పాలనలో 2,100 నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. గంజాయి, డ్రగ్స్‌తో జగన్ పాలనలో యువత భవిత నాశనం అయిందని చెప్పారు.యువత భవిత చంద్రబాబు నాయుడు, లోకేష్‌బాబుతోనే సాధ్యమని, కూటమి ప్రభుత్వ అభివృద్ధి చూసి, ఓర్చుకోలేక, బెంగళూరు నుండి ఎప్పుడో ఒక్కసారి వచ్చి యువతను రెచ్చగొడుతున్నారన్నారు. ప్రజలు వైసీపీకి 11 స్థానాలు ఇచ్చే సరికి, జగన్ కీ ఏం చెయ్యాలో అర్థం కాక పిచ్చి పట్టి తిరుగుతున్నారన్నారు. జగన్ ఎన్ని చేసినా ప్రజలు మిమ్మలిని నమ్మే పరిస్థితులు లేవని గౌస్ భాషా కొట్టి పారేశారు.

# రిటైర్డ్ టీచర్ యల్లమంద మృతి బాధాకరం

### మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్



కనిగిరి, మేజర్‌న్యూస్: పట్టణంలోని ప్రగతి విద్యా నిలయం గౌరవ సలహాదారు, రిటైర్డ్ ఉపాధ్యాయులు ఉప్పలపాటి యల్లమంద మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ యల్లమంద భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిగిరి,చీమకుర్తి ప్రాంతాల్లో ఉపాధ్యాయునిగా యల్లమంద విశేష సేవలు అందించారన్నారు. ఎంతోమంది విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించి, వారి ఉన్నతికి తోడ్పడ్డారన్నారు. కొప్పోలు ప్రభాకర్ స్థాపించిన ప్రగతి విద్యా నిలయంలో 20ఏళ్లపాటు గౌరవ సలహాదారుగా విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేసిన యల్లమంద మృతి విచారకరమన్నారు. యల్లమంద భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో ప్రభుత్వ వైద్యులు డాక్టర్ తిరుపతిరెడ్డి, డాక్టర్ వెంకట సుబ్బయ్య, ఎమ్మెస్సార్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటరెడ్డి, విజేత కళాశాల డైరెక్టర్ పసుపులేటి అరుణోదర్ ,ప్రగతి విద్యా నిలయం ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మానసిక వేదనకు గురవుతున్న సచివాలయ ఉద్యోగులు



జరుగుమల్లి, మేజర్‌న్యూస్: రాష్ట్రంలోని గ్రామ సచివాలయ ఉద్యోగులకు సర్వేల పని భారం పెరిగిపోయిందని డెమోక్రటిక్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ గ్రామ వార్డు సచివాలయం ఎంప్లాయిస్ 69 బార్ 21 రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ షరీఫ్ బుధవారం ప్రకటన తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకకాలంలో వివిధ సర్వేలు పూర్తి చేయాలని సచివాలయ ఉద్యోగులను అధికారులు తీవ్రమైన ఒత్తిడికి గురి చేస్తున్నారని ఈ సందర్భంగా తెలిపారు. ఈ సర్వేల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రజలలో అవగాహన కల్పించకపోవడం వలన అనేక చోట ఈ సర్వేలలోని వివరాలను తెలియ చేయడానికి ప్రజలు ఉద్యోగులకు సహకరించడం లేదని తెలిపారు. గత ఎనిమిది నెలలుగా 14రకాల వివిధ సర్వేల పను లు పూర్తి చేయాలని సచివాలయ ఉద్యోగులకు అప్పగించారని ఒక సర్వేకి మరొక సర్వేకి మధ్య సమయం తక్కువగా ఉంటుందని సెలవు రోజుల్లో కూడా సర్వేర్ పూర్తి చేయా లనే ఆదేశాలు పట్ల తీవ్రమైన పని ఒత్తిడితో ఉద్యోగులు మానసిక వేదనకు గరవుతున్నారన్నారు. హేతుబద్ధీకరణ చేసే ముందుగా రాష్ట్ర ప్రభుత్వం వీలైనంత త్వరగా సీనియర్ ఐఏఎస్ అధికారులతో కమిటీ నియమించాలని కోరారు.



## ఏలూరు, సల్లూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

పొదిలి, మేజర్ న్యూస్: మండలంలోని ఏలూరు, టి.సల్లూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి షేక్ జైనులాబ్దిన్ ముఖ్యఅతిథిగా పాల్గొని వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అమలవుతున్న వివిధ పథకాలను వివరించారు.రబీ లో పంట నమోదు చేయించుకున్న రైతుల జాబితాను రైతు సేవా కేంద్రాల నందు సామాజిక తనిఖీ కొరకు ముసాయిదా జాబితాను ప్రదర్శించడం జరిగిందన్నారు. రైతులు అందరూ సరి చూసుకొని తప్పులు ఏమైనా ఉన్నట్లు అయితే రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహయకులకి తెలియజేయాలని కోరారు.రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య ఇప్పటివరకు ఎవరైనా చేయించుకోకుండా ఉన్నట్లయితే త్వరగా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకానికి 2.5 లక్షల కోట్లు కేటాయించాలి



చీమకుర్తి, మేజర్‌న్యూస్: గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్‌లో 2.5లక్షలకోట్లు కేటాయించాలని, ఏడాదికి 200రోజులకి పనిదినాలు పెంచాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పూసపాటి వెంకటరావు డిమాండ్ చేశారు. మంగళవారం ప్రజచైతన్య యాత్రలలో భాగంగా కేవీపాలెం, మువ్వావారిపాలెం లలో పనిచేస్తున్న ఉపాధి హామీ కార్మికులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.తమిళనాడు, కేరళ రాష్ట్రలలో మాదిరి ఉపాధి హామీని పట్టణాలకు కూడా విస్తరింపచేయాలని, పనిప్రదేశంలో కూలీలకు కల్పించాల్సిన మౌలికవసతులు కల్పించాలని వెంకట్రావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వ్యవసాయ కార్మికులకు సంక్షేమ బోర్డ్ ఏర్పాటుచేస్తామని చెప్పారని అధికారంలో కి వచ్చి 9నెలలు అవుతున్నా ఆ ఊసే లేదని విమర్శించారు. పెండింగ్ లో ఉన్న బిల్లులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పులి ఓబులరెడ్డి, నల్లూరి కృష్ణయ్య, కొల్లూరి అక్కయ్య, బ్రహ్మయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# వెలుగొండ ప్రాజెక్టు ముంపు బాధితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ ప్రారంభం



మార్కాపురం, మేజర్‌న్యూస్: పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్ట్ ముంపు బాధితులకి ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వడం ప్రారంభించారు. తొలి విడతగా చింతలముడిపి కాటంరాజు తాండ గ్రామాలకు గ్రామంలో 35 కోట్లు మంజూరు కాగా అవార్డు మంగళవారం రైతులందరూ రాయవరంలో ఉన్నటువంటి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆఫీస్ నందు కార్యక్రమం జరుగుచున్నది. ఆ గ్రామాలకు ఇవ్వంగ మిగిలిన డబ్బులు సుంకేసుల గ్రామంలో ఇవ్వడం జరుగుతుందని డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణ తెలియజేశారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయని రైతులను అడిగి తెలుసుకోవడం జరిగింది. కొందరు రైతులు వయసు సరిపోని కారణంగా ఆర్‌ఆర్ ప్యాకేజీకి దూరమవుతున్నారని ముంపు బాధితులు మార్కాపురం నియోజకవర్గ బిజెపి అసెంబ్లీ ఇన్చార్జి పివి కృష్ణారావు తెలియజేయగా అర్హులైన అందరికీ అందజేసే విధంగా అధికారులతో మాట్లాడతానని అధికారులతో మాట్లాడటం జరిగినది.

# నేటి నుంచి 70వ వార్షిక తిరునాళ్లు

మూడు రోజుల పాటు వార్షిక బ్రహ్మోత్సవాలు

14న ప్రధాన తిరునాళ్లు, కట్టుదిట్టమైన ఏర్పాట్లు

ప్రధాన ఆకర్షణగా విద్యుత్తు ప్రభలు

అద్దంకి, మేజర్‌న్యూస్: దక్షిణ భారత దేశంలోనే అత్యంత మహిమాన్విత క్షేత్రంగా సింగరకొండ విరాజిల్లుతోంది. కొండపై కొలువైన లక్ష్మీనరసింహస్వామి దిగువున దక్షిణాముఖంగా స్వయంభుగా వెలసిన ప్రసన్నాంజనేయ స్వామి సింగరకొండ ప్రత్యేకతలు. సెంటు భూమి లేకున్నపటికీ భక్తులు అందించే కానుకలు దుకాణాలతో ఏటా నాలుగు కోట్లకు పైగా ఆదాయం కలిగిన ప్రసన్నాంజనేయ స్వామి విశేష ప్రాచుర్యం పొందాడు. పిలిచిన పలికే దైవంగా భక్తుల పాలిట కల్పవృక్షంగా భక్తుల మనోభీష్టములు నెరవేరుస్తూ భక్తులచే ప్రసన్నాంజనేయ స్వామి పూజలు అందు కొనుచున్నారు. శింగరకొండ 70వ వార్షిక తిరుణాళ్ల మహోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు నిరాటంకంగా కొనసాగే ఈ ఉత్సవాలకు రాష్ట్రం లోని పలు జిల్లాల నుంచి భక్తులు విరివిగా హాజరు కానున్నారు. ఫాల్గుణ శుద్ధపౌర్ణమి శుక్రవారం నాడు తిరుణాళ్ల ప్రధాన ఘట్టం జరగనుంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అన్ని ప్రభుత్వశాఖల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే రెండు పర్యాయాలు సమన్వయకమిటీ సమావేశాలు నిర్వహించి ఆయా ప్రభుత్వశాఖల అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది అందించే సేవల గురించి చర్చించారు. చీరాల ఆర్డీవో తూమాటి చంద్రశేఖరనాయుడు పర్యవేక్షణలో చీరాల డీఎస్పీ ఎం.డి.మొయిన్ నేతృత్వంలో తిరుణాళ్ల విజయవంతానికి కృషి చేస్తున్నారు. భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యేక




బస్సులను గ్రామాల నుంచి క్షేత్రం వరకు నడపనున్నారు. క్యూలైన్లలో నిలబడే భక్తులకు, చిన్నారులకు పాలు, మంచినీరు అందించనున్నారు.

**ఉత్సవాలకు హాజరుకానున్న మంత్రి గొట్టిపాటి**

శింగరకొండ 70వ వార్షిక తిరుణాళ్ల మహోత్సవం ఆరంభం బుధవారం ఉదయం జరుగుతుంది. ధ్వజస్థంభం దాత మేదరమెట్ల శంకరారెడ్డితో జీవధ్వజ, ఉష్ణపతాక పూజ, ధ్వజారోహణతో తిరుణాళ్ల ఉత్సవాలు మొదలవుతాయి. ఇదే సమయంలో కొండపైన గల లక్ష్మీ నరసింహస్వామి ఆలయం వద్ద, పతాకావిష్కరణ జరుగుతుంది. సాయంత్రం ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద జరిగే జ్యోతిప్రజ్వలన కార్యక్రమానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ హజరుకానున్నారు. దీంతో తిరుణాళ్ల బ్రహ్మోత్సవాలు పూర్తిస్థాయిలో ప్రారంభమౌతాయి. ఈ సందర్భంగా గజవాహనసేవ నిర్వహిస్తారు. 13వ తేదీ రాత్రికి ఉష్ణ వాహనసేవ నిర్వహిస్తారు. 14వ తేదీ ప్రధాన తిరుణాళ్ల నాడు రథోత్సవం నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు బాపట్ల, ప్రకాశం, పల్నాడు, గుంటూరు, కృష్ణా,నెల్లూరు జిల్లాల నుంచి సుమారు మూడు లక్షల మంది భక్తులు వస్తారని అంచనా. సహాయ కమిషనర్ మదమంచి తిమ్మానాయుడు తోపాటు లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈఓ ఎస్ కోటిరెడ్డి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది వారి పనుల్లో నిమగ్నమయ్యారు. రెవిన్యూ, పోలీసు,అబ్కారీ, వైద్య ఆరోగ్య, కార్మిక, ఆర్టీసీ, పురపాలక సంఘం, గ్రామపంచాయతీ అధికారులు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తూ సేవలు అందించనున్నారు. విద్యుత్తుశాఖ అధ్వర్యంలో అవసరమైన పరివర్తకాలను సిద్ధంగా వుంచారు. శింగరకొండ 70వ వార్షిక తిరుణాళ్ల ఉత్సవాలకు సమీప గ్రామాల నుంచి భారీ విద్యుత్తు ప్రభలు ఏర్పాటు చేస్తున్నారు. దీనికోసం తిరుణాళ్ల ప్రాంగణాల్లో జెండాలు పాతి స్థలాలను సిద్ధం చేసుకున్నారు. శింగరకొండపాలెం నుంచి రెండు, అద్దంకి పట్టణం నుంచి మూడు వెరసి ఐదు విద్యుత్తు ప్రభలు ఏర్పాటు చేయనున్నారు.

# మహిళా ఆర్థికాభివృద్ధికి పెద్దపీట

మహిళల భద్రత కోసం శక్తి బృందాలు

రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నూకసాని బాలాజీ



ఒంగోలు, మేజర్‌న్యూస్ : మహిళలను ఆర్థికంగా వృద్ధిలోకి తెచ్చేందుకు వారి కాళ్లపై వారు నిలబడేలా డ్వాక్రా సంఘాలను సీఎం చంద్రబాబు ఏర్పాటు చేసి వారిలో మానసిక స్థైర్యాన్ని పెంపొందించారని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ ప్రకటన ద్వారా కొనియాడారు. ఈ సందర్భంగా నూకసాని బాలాజీ మాట్లాడుతూ మహిళలకు అత్యధిక గౌరవం ఇచ్చే పార్టీ తెలుగుదేశం అని, తొలి తెలుగు మహిళా స్పీకర్ అభ్యర్థిత్వాన్ని ఎంపికచేసిన ఘనత టిడిపికే దక్కిందని తెలియజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళల కోసం అనేక పథకాలను రూపొందించిందని మహిళా సంక్షేమం, సాధికారత, భద్రత కోసం వివిధ సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకొని అనేక పథకాలు, కార్యక్రమాలను ప్రారంభించిందని అన్నారు. లక్ష మంది మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తయారు చేయడమే లక్ష్యంగా సెర్ప్, మెప్మా, ఎంఎస్ఎంఈ రంగాలలో మహిళల కోసం ప్రత్యేకంగా ప్రభుత్వం దృష్టి పెట్టిందని ఇందుకు సంబంధించి ప్రకటనను సీఎం చంద్రబాబు విడుదల చేశారని అన్నారు. మెప్మాలో 30 వేలమంది, ర్యాపిడ్ లో 10 వేల మంది మహిళలు, స్వయం ఉపాధి పథకాల్లో 4 వేలు, కేంద్ర ప్రాయోజిత పథకాల్లో 4 వేలు, టూరిజం సంబంధిత రంగాల్లో 4 వేలు, తృప్తిహోటళ్లలో 4 వేలు, స్మార్ట్ స్ట్రీట్స్ వెండింగ్ జోన్ లలో 2 వేలమంది, టిడ్కో లైవ్లీ హుడ్ సెంటర్లో మరో 2 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. వ్యవసాయ ఆధారిత, తయారీ యూనిట్లు, సేవారంగం, వ్యాపారాల్లో మహిళలకు జీవనోపాధి కల్పించేందుకు ప్రభుత్వం రోడ్ మ్యాప్ ను సిద్ధం చేసింది 2025-26 సంవత్సరానికి ఎం.ఎస్.ఎం.ఈ రంగంలో 10 వేల మందికి జీవనోపాధి కల్పించేందుకు కార్యాచరణను ప్రభుత్వం విడుదల చేసింది. మహిళలు, పిల్లల భద్రత కోసం సీఎం చంద్రబాబు శక్తి బృందాలను ప్రారంభించారు. బహిరంగ ప్రదేశాల్లో మహిళలు, చిన్నారులపై వేధింపులను నిరోధించడమే ప్రధాన లక్ష్యంగా శక్తి బృందాలు పనిచేస్తాయి. వీటి ద్వారా చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించాలని నిర్ణయించారు. ప్రతి జిల్లాకు రూ. 60 లక్షలు కేటాయించారు. దీని ద్వారా చేనేత ఉత్పత్తుల విక్రయం మరింత సులభతరం కానుంది. ఈ సందర్భంగా ప్రతి చేనేత మహిళకు 36 చీరలు నేసే నూలును ఉచితంగా పంపిణీచేశారు.

# సీఎం హామీల అమలుపై కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

**భూముల పున: పరిశీలన పటిష్టంగా చేపట్టాలి**

**వీడియో కాన్ఫరెన్స్‌లో సిసిఎల్ఏ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మీ**

ఒంగోలు, మేజర్‌న్యూస్ : నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన భూముల పున పరిశీలన పటిష్టంగా చేపట్టాలని సిసిఎల్ఎ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. అమరావతి నుంచి సిసిఎల్ఎ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అన్ని జిల్లాల కలెక్టర్లతో మంగళవారం వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిసిఎల్ఎ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి మాట్లాడుతూ నిషేధిత భూముల జాబితాలో నుంచి తొలగించిన భూములు చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ అయ్యాయా... లేదా... పూర్తిస్థాయిలో పరిశీలన జరగాలన్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాల్లో జరుగుచున్న రీ సర్వే ప్రక్రియ నిర్దేశించిన గడువులోపు పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. రెవిన్యూ సదస్సుల్లో నమోదైన



అర్జీలన్నింటిని సంతృప్తి స్థాయిలో పరిష్కరించాలని చెప్పారు. ముఖ్యమంత్రి హామీల అమలుపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చుపాలన్నారు. రీ సర్వేలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు తక్షణమే పరిష్కారం చూపాలన్నారు. ఒంగోలు కలెక్టరేట్ నుండి ఈ వీడియో కాన్ఫెరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాల క్రిష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి గౌష్ బాషా, కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# టిడిపి పాలనలో అంగన్‌వాడీలకు భద్రత, ఆర్థిక భరోసా

**తెలుగు నాడు, అంగన్వాడి, డ్వాక్రా నాయకులు**

ఒంగోలు, మేజర్‌న్యూస్ : టిడిపి పాలనలో మనోవికాస కేంద్రాలుగా పనిచేసిన అంగన్వాడి కేంద్రాలు జగన్మోహన్ రెడ్డి అసమర్థ పాలనలో సమస్యల వలయంలో చిక్కుకొని విలవిలలాడాలయని తెలుగు నాడు అంగన్వాడి డ్వాక్రా నాయకురాళ్లు అన్నారు. ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అంగన్వాడీలను ఇబ్బంది పెట్టిన జగన్ రెడ్డి వారికి జీతాలు పెంచకుండా నెలవారి జీతాలు సకాలంలో ఇవ్వకుండా వెట్టి చాకిరీ చేయించి తానే నిజమైన పెత్తందారులా ప్రవర్తించాడు. ప్రభుత్వం కంటే తక్కువ బడ్జెట్ ఉన్నప్పటికీ 2014-19 మధ్య చంద్రబాబు ప్రభుత్వం అంగన్వాడీలకు జీతాలు పెంచి సంక్షేమం అందించింది. విభజన ఆంధ్రప్రదేశ్ని విభజన కష్టాలు వెంటాడుతున్నప్పటికీ అంగన్వాడీలకు అప్పటి టిడిపి ప్రభుత్వం వేతనాల పెంపులో ఏ మాత్రం వెనకడుగు వేయలేదు. జగన్ రెడ్డి పాదయాత్రలో ఒక ఛాన్స్ ఇవ్వండి తెలంగాణ కంటే ఎక్కువ జీతం ఇస్తానని నమ్మ బలికి తీరా అధికారంలోకి రాగానే కేవలం వెయ్యి రూపాయలు పెంచి చేతులు దులుపుకున్నాడు, జగన్ రెడ్డి హయాంలో తెలంగాణలో అంగన్వాడీల జీతం 13,500 కాగా ఏపీలో 11500 పరువు రాష్ట్రంతో సమానంగా జీతం పెంచకపోగా ఆదాయ పరిమితి అస్త్రంతో అంగన్వాడీల సంక్షేమములో కోత పెట్టాడు. 51 2099 మంది అంగన్వాడీలు పథకాల ఆర్థిక సాయం కోల్పోయారు. పెన్షన్ ఈఎస్ఐ గ్రాడ్యుటి వంటివి అమలు చేయాలని గత ఐదేళ్లుగా అంగన్వాడి ఉద్యోగులు గగ్గోలు పెట్టిన జగన్ రెడ్డి ప్రభుత్వం పెడచెవిన పెట్టింది అంగనవాడిల పట్ల అత్యంత కర్కశంగా వ్యవహరించిన జగన్ ప్రభుత్వం వితంతువు ఒంటరి మహిళ దివ్యాంగ పెన్షన్లు కూడా నిలిపివేసింది. ఎప్పుడు లేని విధంగా అంగన్వాడీలకు ఒకటో తేదీని వేతనాలు అందిస్తుంది కూటమి ప్రభుత్వం అన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అంగన్వాడి యూనియన్ అధ్యక్షురాలు గడ్డం అనంతలక్ష్మి, తెలుగు నాడు అంగన్వాడీ డ్వాక్రా ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షురాలు ఉప్పలపాటి నాగేంద్రమ్మ, రాష్ట్ర అంగన్వాడి కార్యనిర్వాహ కార్యదర్శి పెద్ది శెట్టి వరలక్ష్మి, అంగన్వాడి జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మెహరీన్‌సా బేగం, తదితరులు పాల్గొన్నారు.



# నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో పోలీసుల ప్రతిభ

**అభినందించిన జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్**

ఒంగోలు, మేజర్‌న్యూస్ : మార్చి 4 నుండి 9 తేదీల్లో బెంగుళూరులో 45వ నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2025 పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రకాశంజిల్లా పోలీస్ శాఖ తరపున 30 ప్లస్ ఏజ్ గ్రూప్ విభాగంలో పోలీసులు వివిధ విభాగాలలో తమ ప్రతిభను చాటుకున్నారు. నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని విశేష ప్రతిభ కనబరిచి పలు పతకాలు కైవసం చేసుకున్న ఆర్ఎస్ఐ సురేష్, కానిస్టేబుల్‌లను జిల్లా ఎస్పీ మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించి సర్టిఫికెట్స్, మెడల్స్‌ను అందజేశారు. జిల్లా పోలీస్ శాఖలో ప్రతిభ గల పోలీస్ సిబ్బంది క్రీడలలో పాల్గొనాలన్నారు. క్రీడలలో వారికి ప్రోత్సాహం అందిస్తూ అన్ని విధాలా సహకారం అందిస్తామన్నారు. వారితో భవిష్యత్తులో కూడా మరిన్ని విజయాలు సాధించాలని, పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, ఐటి కోర్ సీఐ సూర్యనారాయణ, ఆర్ఐ రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## భాగసామ్య గ్రామీణ అంచనాపై అవగాహన




కర్లపాలెం, మేజర్‌న్యూస్: రైతుల వ్యవసాయంను ఏ విధంగా సాగుచేస్తున్నారు ఏ మందులు వాడుతున్నారు తెలుసుకొని వారికి పలు సూచనలు ఇవ్వడం ద్వారా దిగుబడులు పెంచవచ్చని బాపట్ల ఏరువాక సైటిస్ట్ డాక్టర్ ఎం.ఉష అన్నారు.కర్లపాలెం పంచాయతీ లైబ్రరీ వద్ద కదిరి బాబూరావు వ్యవసాయ కళాశాల విద్యార్థులు భాగస్వామ్య గ్రామీణ అంచనా కార్యక్రమం నిర్వహించారు.గ్రామ పటం, వనరులు, రైతుల ఇబ్బందులు, మ్యాట్రిక్ చెట్టు ద్వారా రైతులకు విద్యార్థులు వివరించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త ఉష మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ మురళీధర్ నాయక్,గ్రామ వ్యవసాయ సహాయకులు భ్రమరాంబిక,మొయిన్, సుదేవ్, ఉమ,హరిబాబు,అరుణ్ తదితరులు పాల్గొన్నారు

## రైతు సేవా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోండి: సత్యానంద్



పిట్టలవానిపాలెం, మేజర్‌న్యూస్: మండలంలోని భవనంవారి పాలెం, పిట్టువారిపాలెం గ్రామాల్లో వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు వ్యవసాయం లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ విస్తరణ కార్యక్రమం పొలం పిలుస్తుంది నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పిట్టలవానిపాలెం మండల వ్యవసాయ అధికారి సి.హెచ్. సత్యానంద్ పాల్గొని తప్పనిసరిగా సొంత పొలాలు ఉన్న రైతులందరూ రైతు సేవ కేంద్రాల్లో ఎన్రోల్ చేసుకోవాలని కోరారు. ప్రస్తుత ఉన్న పైర్లు మినుము, పెసర, వేరుశనగ పొలాల్లో కోతకు వచ్చే సమయాల్లో రైతులు తీసుకోవలసిన పలు జాగ్రత్తలు గురించి క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ విస్తరణ అధికారులు గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

## తాగునీటి చెరువు నింపివేత



కర్లపాలెం, మేజర్‌న్యూస్: వేసవిలో త్రాగునీటి ఎద్దడి తలెత్తకుండా పూర్తి స్థాయిలో త్రాగునీటి చెరువును నింపామని నాగరాజుపాలెం గ్రామ సర్పంచ్ షేక్ మస్తాన్ బీ తెలిపారు. అధికారుల సూచనలతో ముందుగానే మోటార్ల సహాయం తో నింపామన్నారు.ఈ కార్యక్రమంను కార్యదర్శి తిరుపాల్ రెడ్డి,ఇంజనీరింగ్ అసిస్టెంట్ వేణులు పర్యవేక్షణ చెశారని తెలిపారు.

## వాయిదా పడిన దేవస్థానం లీజు లైసెన్స్ హక్కులు



పిట్టలవానిపాలెం, మేజర్‌న్యూస్: మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసిన శ్రీ బగలాముఖి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం జరిగిన లీజు లైసెన్స్ హక్కుల బహిరంగ వేలం ప్రకటనలో 21 మంది హాజరయ్యారు. అందులో 11 మంది డిపాజిట్లు చెల్లించి వివిధ కారణాలవల్ల పాటకు ముందుకు రాలేకపోయారు వారు చెప్పిన వివిధ కారణాలవల్ల ఈ పాటను మూడవసారి ఈనెల 19వ తేదీ బుధవారం పాటలు జరుపబడుతుందని బాపట్ల డివిజన్ దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ ఎం గోపి, ఆలయ కార్య నిర్వహణాధికారి జి నరసింహామూర్తి సంయుక్త ప్రకటనలో తెలియజేశారు.

# నిర్లక్ష్యణ ధోరణిలో మత్స్యశాఖ ఉద్యోగులు

బాపట్ల, మేజర్‌న్యూస్: మత్స్యకార భరోసా ప్రకటనలకే పరిమితమవుతుందని మత్స్యకార భరోసా వెంటనే అందించాలని బీజేపీ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కొక్కిలీగడ్డ శ్రీనివాస రాజు అన్నారు. బాపట్ల జిల్లా మత్స్య కార జాయింట్ డైరెక్టర్ బీ.కృష్ణ కిషోర్ ను కార్యాలయంలో కలసి వికసిత్ భారత్ యాత్రలో జారీ చేసిన కిసాన్ క్రెడిట్ కార్డుల వివరాలు, జిల్లాలో లబ్ధిదారుల వివరాలు, కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న మత్స్య సంపద యోజన పథకం పూర్వపు లబ్ధిదారుల వివరాలు కోరగా సమాచారం లేదనడంతో నిరుత్సాహానికి గురయ్యానన్నారు. తీర ప్రాంతంలో ఉన్న రొయ్య సాగు రైతుల నుంచి కోస్టల్ ఆక్వా అథారిటీ వారు జారీ చేసే లైసెన్సులను రెన్యువల్ చేయలేదన్నారు. మత్స్య శాఖ ఉద్యోగులు ఈ లైసెన్సుల గురించి పూర్తిగా అవగాహన లేకపోవడం వలన రైతులు కేంద్ర ప్రభుత్వ పథకాలకు దూరం అవటం జరుగుచున్నది. దీనివలన రాష్ట్రంలో ప్రధానమంత్రి మత్స్య సంపద యువజన పథకము పూర్తిగా విఫలమవుతుందన్నరు. సాగర మిత్రులు , విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్లు, ఫిషరీస్ డెవలప్మెంట్ ఆఫీసర్లు , అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్, జాయింట్ డైరెక్టర్లు ఈ విషయాల గురించి పూర్తి అవగాహన లేకపోవడం చాలా హాస్యాస్పదముగా ఉన్నదన్నారు. కనుక కేంద్ర ప్రభుత్వం ఈ పథకానికి



ప్రతి రాష్ట్రానికి ఒక కోఆర్డినేటర్ ను నియమించాలన్నారు. వారిద్వారా రైతులకు అందవలసిన ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకమును పర్యవేక్షించవలెనని ఆక్వా రైతులు కోరారన్నారు.గత సంవత్సరం కేంద్ర ఫిషరీస్ మంత్రి వర్యులు నిజాంపట్నం హార్బర్ కు విచ్చేసిన సందర్భంలో బ్యాంకర్ల ద్వారా లబ్ధిదారులకు చెక్కు రూపేనా చెల్లిస్తామని చెక్కులు ఇప్పించడం జరిగినది. ఆ చెక్కుల తాలూకు అమౌంట్ ఈరోజు వరకు వారి ఖాతాల్లో జమ కాకపోవటం గమనించాలన్నారు. మత్స్యశాఖ గురించి పూర్తి అవగాహన లేనటువంటి వ్యక్తులు ఈ శాఖలో ఉన్నారు. అనేక విషయాలను రైతులు మా వద్ద తెలియపరచడం జరిగినది అన్నారు.ఆయనతో పాటు బిజెపి పార్టీ జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ అంగలకుదురు నటరాజన్, మువ్వల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# పంట నమోదు ముసాయిదా జాబితా చూసుకోవాలి

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: మండలంలో 2024-25 సంవత్సరం రబీ సీజనుకు సంభందించి రెవెన్యూ వ్యవసాయ సిబ్బంది సంయుక్తంగా పంటనమోదు చేసిన రైతుల వివరాలు జాబితాను ఆయా గ్రామ రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించినట్లు రైతులు జాబితాలను చూసుకుని అభ్యంతరాలు ఏవైనా ఉంటే తెలిపాలని మండల వ్యవసాయ అధికారి బి.సంపత్ కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని సి.ఎస్.పురం, బోయమడుగుల రైతు సేవాకేంద్రాల్లో పంట నమోదుపై గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు వేసిన పంటలకు సంభందించి నమోదును రెవెన్యూ వ్యవసాయ అధికారులు సంయుక్తంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించినట్లు రైతులు పంట నమోదు జాబితాలో తమ వివరాలు చూసుకుని ఏవైనా పొరపాట్లు అభ్యంతరాలు ఉంటే రైతుసేవాకేంద్రాల్లో వ్యవసాయ



సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించి పంటలను పరిశీలించి తెగుళ్ల నివారణకు అధిక దిగుబడి సాధించడానికి పలుసూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ సంపత్ కుమార్, ఎంపిఇఓ పావలి శ్రీనివాసులు, బోయమడుగుల ఎంపిటిసి బి.తిరుపతిరెడ్డి, వ్యవసాయ సిబ్బంది జి.రామశారద,పర్వీన్, పి.రవి, రైతులు పాల్గొన్నారు.

# రైతులకు వ్యవసాయ సాగుపై అవగాహన

త్రిపురాంతకం, మేజర్‌న్యూస్: మండలంలోని వెల్లంపల్లి, విశ్వనాథపురం గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి కే.నీరజ పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెల్లంపల్లి, విశ్వనాథపురం గ్రామాల్లో రబీ 2024-25 ఈ పంట ముసాయిదా జాబితాను సోషల్ ఆడిట్ నందు ప్రదర్శించడం జరిగింది. అదేవిధంగా గ్రామ సభలో ఈ పంట నమోదు చేసిన వారి పేర్లను చదివి వినిపించడం జరిగింది. అదేవిధంగా ఈ పంట జాబితాను ఈనెల 7వ తేది నుండి 11వ తేది వరకు ప్రతి గ్రామంలో గ్రామ సభలు పెట్టి చదివి వినిపించడం జరుగుతుందని తెలియజేశారు. అలాగే ఈ పంట జాబితాలో ఎలాంటి మార్పులు చేర్పులు ఉన్న తేదీ ఈనెల 13 నుండి 18వ తేది వరకు అవకాశం కల్పించాలని రైతు సోదరులకు తెలియజేయడం జరిగింది. ఈనెల 22వ తేదిన తుది జాబితాను ప్రదర్శించడం జరుగుతుందని తుది



జాబితా ప్రదర్శన తర్వాత ఈ పంట లిస్ట్ నందు ఎలాంటి మార్పులు చేర్పులు చేయబడును అని గ్రామసభనందు తెలియజేయడం జరిగింది. అదేవిధంగా ప్రతి రైతు కూడా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి వారు కోరారు. ఈ గ్రామ సభలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఆర్.మంత్రు నాయక్, కె.ప్రేమ్ కుమార్, రైతు సోదరులు పాల్గొన్నారు.

# జాబ్ క్యాలెండర్ పేరుతో మోసం చేసిన జగన్‌రెడ్డి

పంగులూరు , మేజర్‌న్యూస్: 2019 ఎన్నికల సమయంలో ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ ఇస్తానని యువతను నమ్మించి దారుణంగా మోసం చేసింది మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అని నవ్యాంధ్రప్రదేశ్ నిరుద్యోగ సంఘ అద్దంకి నియోజకవర్గ ప్రెసిడెంట్ నరేంద్ర అన్నారు. విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 12వ తారీఖున "యువతపోరు " అనే పేరుతో మరలా యువతను మోసం చేయడానికి రోడ్డు ఎక్కటం సిగ్గుమాలిన చర్య అని హెచ్చరించారు. వాస్తవానికి జగన్మోహన్ రెడ్డి జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులతో పాటు, విద్యార్థులకు విద్యా దీవెన, వసతి దీవెన ,అమ్మఒడి పేర్లతో ప్రజలను మభ్యపెట్టి,మోసం చేసి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన అనంతరం కొన్ని కోట్ల బడ్జెట్ ను విడుదల చేయకపోవడం వలన చాలామంది ఇబ్బందులు పడ్డారన్నారు. జగన్మోహన్ రెడ్డితో పాటు తమ వైసిపి నాయకుల అక్రమ సంపాదన కొరకు యువతను ఉపయోగించి లిక్కర్, గంజాయి, హెరాయిన్ లాంటి మత్తు పదార్థాల క్రయవిక్రయాలతో



చేపించి కోట్ల రూపాయల సంపాదించారు. ఈ రాష్ట్ర అభివృద్ధికి ప్రధానంగా వనరుగా ఉండవలసిన యువతను పక్కదారి మళ్ళించి ఆ విద్యార్థుల తల్లిదండ్రుల కడుపుకోతకు కారణం జగన్మోహన్ రెడ్డి కదా అని చెప్పారు. ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువ నాయకులు లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ యువతకు ఉపాధి, ఉద్యోగాలే లక్ష్యంగా ప్రైవేటు ,ప్రభుత్వ ఉద్యోగాల కొరకు అన్వేషిస్తూన్నారని గుర్తు చేశారు. త్వరలో సుమారు 17000 టీచర్ ఉద్యోగాలకు కూడా నోటిఫికేషన్ ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు . ఇప్పటికే ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఎన్నికల సమయంలో యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనలో భాగంగా ఇప్పటికే చాలా మంది యువతకు రాష్ట్ర ,దేశం విదేశాలలో ఉద్యోగాలు కల్పించారని గుర్తు చేశారు.

## కుట్టుమిషన్ల శిక్షణ తరగతులకు దరఖాస్తు



నిజాంపట్నం, మేజర్ న్యూస్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ తరగతులను మండల ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని నిజాంపట్నం ఎంపీడీవో నర్రా నాగలక్ష్మి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలములోని అడవులదీవి, ఆముదాలపల్లి, దిండి ,కూచినపూడి, ముత్తుపల్లి, నిజాంపట్నం, పల్లపట్ల ,ప్రజ్ఞం ,గ్రామాల మహిళలు ఆయా గ్రామాల సచివాలయాలలో నెట్ సెంటర్లలో మరియు మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని ఆమె తెలియజేశారు.

### బీసీ కార్పొరేషన్ నుండి ఋణాల కొరకు దరఖాస్తులు :-

2024-25 సంవత్సరంకుగాను బీసీ కార్పొరేషన్ ద్వారా ఋణాలు పొందతలచుకున్నవారు ఈనెల 10వ తేదీ నుండి 22వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని ఎంపీడీవో నర్రా నాగలక్ష్మి మంగళవారం తెలిపారు. ఋణాలకు సంబంధించి యాప్ ఓపెన్ అయిందని బిసి, ఈ బీసీ, ఈ డబ్ల్యూ ఎస్, మొదలగు కులాల వారు అర్హులన్నారు. రైస్ కార్డ్, ఆధార్ కార్డు, క్యాస్ట్ సర్టిఫికెట్, బ్యాంకు పాస్ బుక్, మరియు పాస్పోర్ట్ సైజ్ ఫోటో తీసుకువెళ్లి ఆన్లైన్లో అప్లై చేసుకోవచ్చు అని తెలియజేశారు.

## సంక్షేమ పథకాలకు రైతు గుర్తింపు సంఖ్య అవసరం



కర్లపాలెం, మేజర్‌న్యూస్: రైతులకు సంక్షేమ పథకాలు అందించేందుకు గుర్తింపు సంఖ్య అవసరమని జిల్లా సహాయ వ్యవసాయ సంచారకులు రత్నకుమారి అన్నారు.కర్లపాలెం మండలం బోలయపాలెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు రత్నకుమారి పాల్గొని మాట్లాడుతూ రబీ సీజన్ లో పంట నమోదు చేసుకున్న తాలూకా ముసాయిదా జాబితా రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉంటుందని, సవరణలు ఏమైనా ఉంటే ఈ నెల 17 వ తేదీ లోపల గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు.మినుము మరియు పెసర వేసి పంట నమోదు చేయించుకున్న రైతులు రైతు సేవా కేంద్రాల ద్వారా కనీస మద్దతు ధరకు వేసుకోవచ్చని తెలిపారు. దీని కొరకు రైతులు మొదట రైతు సేవా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. పెసరకు క్వింటాలుకు 8682 కనీస మద్దతు ధర ప్రభుత్వం కల్పించగా, మినుముకు 7400 క్వింటాలుకు కల్పిస్తుందని తెలిపారు. ప్రభుత్వ నియమాల ప్రకారం 12% తేమ ఉండాలని, యితర వ్యర్థాలు 2% కు మించి ఉండకూడదని, విరిగిన, రంగుమారిన గింజలు 3% లోపల ఉండాలని సూచించారు. నేల పుష్టికి పచ్చిరొట్ట పైరు వేసి దున్నడం ఎంతో ముఖ్యమని, తద్వారా నేల లోని చౌడు విరిగి భూమి గుల్లబారుతుందని తెలిపారు.